నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
ఆదివారం | జులై 21, 2024 | www.navatelangana.com

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

- సెప్టెంబర్ 16 చివరి తేదీ.. జనవరి 18న ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ-నిజంసాగర్

మండల కేంద్రంలోని నవోదయ పాఠశాలలో 2025-2026 విద్య సంవత్సరనికి ఆరవ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సత్యవతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి 16 సెప్టెంబర్ చివరి తేదీ అని, ప్రవేశ పరీక్ష 18 జనవరి 2025 నిర్వహించనున్నట్టు తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి హ్ట్ఱజూం://ఇఖఐశీఖఖ.స్త్రశీఐ.ఱఅ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. నోటిఫికేషన్ ప్రకారం ఒక జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల పిల్లలకి 75 శాతం సీట్లను భర్తీ చేయనున్నట్టు తెలిపారు. ఇట్టి అవకాశాన్ని గ్రామీణ ప్రాంత విద్యార్థులందరూ ఉపయోగించుకోవాలని ఆమె తెలిపారు.

ఈరవత్రి అనిల్‌కు ఘన సన్మానం

నవతెలంగాణ-బాల్కొండ

తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్‌ను కిసాన్ నగర్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులు శనివారం ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ గా పదవి బాధ్యతలు చేపట్టిన అనంతరం స్వగ్రామం కిసాన్ నగర్ కు మొదటిసారి రావడంతో సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడు మనోహర్, దేవ రెడ్డి, కుండ నరసయ్య, కేశవ్, పర్వాగౌడ్, ప్రేమ్, దశ గౌడ్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అనిల్‌ను సన్మానిస్తున్న పలువురు


ముసురు వర్షంతో నిర్మానుష్యంగా మారిన కోర్టు చౌరస్తా

'ముసురు'కుంది..

నవతెలంగాణ-కంఠేశ్వర్



నగరంలో శనివారం తెల్లవారుజాము నుంచి ముసురు వర్షం కురిసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుఫాన్ గా మారే అవకాశం కూడా ఉందన్నారు. అందుకని అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా లోతట్టు ప్రాంతాలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. అదేవిధంగా నిజామాబాద్ నగరంలో లోతట్టు ప్రాంతాలలో రిహాబిలిటేషన్ సెంటర్లను నిజామాబాద్ మున్సిపల్ ఆధ్వర్యంలో నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మకరంద్ స్వయంగా పర్యవేక్షించారు. అధికారులం దరూ జిల్లా కేంద్రంలో అందుబాటులో ఉండాలని, సెలవులు రద్దు చేస్తునట్టు ప్రకటించారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులను సూచించారు.

ఎడతెరిపి లేని ముసురు..

కంఠేశ్వర్/వర్ని : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ముసురందుకుంది. తెల్లవారు జాము నుంచి ఎడతెరిపి లేకుండా ముసురు వర్షం కురవడంతో ప్రజలకు ఇండ్లకే పరిమితం అయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల భారీవర్షాలు కురిసి నా.. ఉమ్మడి నిజా మాబాద్ జిల్లాలో మాత్రం ముసురు పట్టుకుంది. వర్షాకాలం ప్రారంభం నాటి నుంచి శనివారం కురిసిన వర్షపాతమే ఎక్కువ. ముసురు వర్షంతో అక్కడక్కడ వాగుల్లో, చెరువుల్లో కొత్త నీరువచ్చి చేరుతోంది.


ముసురు వర్షంలో వెళ్తున్న ప్రజలు

స్త్రీ మూర్తి.. మహాశక్తి

- చైతన్యవంతమైన మహిళతో ఇల్లు ఆదర్శం
- సమాన అవకాశాలను అందిపుచ్చుకోవాలి
- మహిళా సాధికారత సదస్సులో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జే.శ్రీనివాస్‌రావు

నవతెలంగాణ-కామారెడ్డి

స్త్రీ అంటే ఒక సామాన్య వ్యక్తి కాదని ఒక మహాశక్తి అని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జే.శ్రీనివా సరావు అన్నారు. చైతన్యవంతమైన మహిళా ఉండే ఇల్లు ఆదర్శవంతంగా ఉంటుందని, ఇల్లు ఆదర్శవంత మైనప్పుడే గ్రామం, మండలం, జిల్లా, రాష్ట్రం దేశం ప్రపంచానికి ఆదర్శంగా తయారవుతుందని అన్నారు. శనివారం కామారెడ్డి పట్టణంలోని కళాభారతి లో జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ సహకారంతో మహిళా, శిశువయోవృద్ధుల సంక్షేమ శాఖ మహిళా సాధికారత పై(నారీశక్తి) ఆశ వర్కర్లు, అంగనవాడి టీచర్లు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, కళాశాలల విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జే.శ్రీనివాసరావు మహిళలు, విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, స్వయం సహాయక మహిళా సంఘ సభ్యులు నిర్వహిస్తున్నది ఉద్యోగ బాధ్యతలు మాత్రమే కాదని వారు చేసేది ఒక సామాజిక సేవ అని అన్నారు.

భారతదేశం ప్రపంచంలో సముచిత స్థానం పొందాలంటే మహిళల ద్వారా ఇంటి నుండే చైతన్యం రావాలని అన్నారు. భారత రాజ్యాంగంలో లింగం, కులం, మతం, భాష లాంటి ఎలాంటి భేదం లేకుండా పురుషులతో పాటు మహిళలకు సమాన అవకాశాలు కల్పించిందని మహిళలు అవకాశాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని అన్నారు. మహిళల సంక్షేమం కోసం గృహహింస నిరోధక చట్టం, పని ప్రదేశంలో లైంగిక వేధింపుల నిరోధక చట్టం, వరకట్న నిషేధ చట్టం, పోక్సో చట్టం తదితర చట్టాలను తీసుకొచ్చినట్టు తెలిపారు.

గతంలో ఏమన్నా సమస్యలు ఉంటే కుల సంఘాలు, గ్రామ పెద్దలు పరిష్కరించడంతో పోలీస్ స్టేషన్లు, కోర్టుల వరకు కేసులు ఎక్కువగా వచ్చేవి కావని, ఇప్పుడు 100 సంవత్సరాలు పని చేస్తే తప్ప పరిష్కారం కానన్ని కేసులు కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. 1987లో న్యాయ సేవ సాధికా ర సంస్థ చట్టాలను తీసుకువచ్చారని ఎలాంటి ఖర్చు లేకుండా అన్ని రకాల కేసులను మండల, జిల్లాస్థాయి న్యాయ సాధికార సేవల సంస్థకు ఫిర్యాదు చేసి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని అన్నారు. న్యాయ సేవ సాధికార సంస్థను సంప్రదిస్తే సమస్య పెద్దది కాకుండా పరిష్కారం సులువు అవుతుందని అన్నారు. విద్యార్థి జీవితం చాలా విలువైనదని సెల్ఫోన్లకు బాని స కాకుండా ఐఏఎస్, ఐపీఎస్ లాంటి ఉన్నతాధికారు లను స్ఫూర్తిగా తీసుకొని కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని సూచించారు. నా స్వగ్రామం కామారెడ్డి పట్టణానికి సమీపంలో ఉందని నేను విద్యార్థి దశలో ఉన్నప్పుడు కామారెడ్డి పట్టణం విద్యా, వైద్యం, వ్యాపా రం రంగాలలో ఉన్నతంగా ఉండడం గమనించానని జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు అని అన్నారు.

జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి డాక్టర్ సిహెచ్. విఆర్ఆర్. వర ప్రసాద్ మాట్లాడుతూ అవసరం ఉన్న పేదలకు ఉచిత న్యాయ సేవలను అందించేందుకు జిల్లా న్యాయ సేవ సాధికార సంస్థ పనిచేస్తుందని అన్నారు. ఈ సంస్థ ద్వారా న్యాయ సేవా సదస్సుల ద్వారా చట్టాలపై అవగాహన కల్పించడం, పెండింగ్ కేసులను లోక్ అదాలత్ ల ద్వారా రాజి చేకూర్చి పరిష్కరించడం, న్యాయ సహాయం అందించడం జరుగుతుందని అన్నారు.

జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ మహిళల ఆర్థిక సావలంబన కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపట్టిందని ముఖ్యంగా మహిళశక్తి కార్యక్రమం ద్వారా స్వయం సహాయక మహిళా సం ఘాల సభ్యులకు 14 రకాల యూనిట్లతో కూడిన స్వయం ఉపాధి అవకాశాలను కల్పించనున్నట్టు తెలి పారు. వితంతు, వృద్ధాప్య పెన్షన్ ఇవ్వడం జరుగు తుందని, సఖి, డిసిపియు, తదితర కార్యక్రమాల ద్వారా గృహహింస కు గురైన మహిళలకు చేయూత అందించడం, బాల్య వివాహాలు జరగకుండా చూడడం, ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలలో మహిళలు లైంగిక వేధింపుల నివారణకు ఇంటర్నల్ కమిటీలను వేసినట్టు తెలిపారు.

జిల్లా ఎస్పీ సింధు శర్మ మాట్లాడుతూ చట్టం మహిళల పక్షాన ఉందని గృహహింస, వరకట్న వేధింపు, లైంగిక దాడి, ఈవ్ టీజింగ్ లాంటి ఏ సమస్యలను మహిళలు ఎదుర్కొన్న న్యాయ సేవ సంస్థను సంప్రదిస్తే న్యాయం జరుగుతుందని అన్నారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని అన్నారు. మహిళల చైతన్య ద్వారానే సమాజం చైతన్యమవుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో మొదటి అదనపు డిస్ట్రిక్ అండ్ సెషన్స్ జడ్జి లాల్ సింగ్ శ్రీనివాస నాయక్, సీనియర్ సివిల్ జడ్జ్ నాగరాణి, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ దీక్ష, కామారెడ్డి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ గౌడ్, ఇతర న్యాయవాదులు, న్యాయస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మహిళా సాధికారత సదస్సులో పాల్గొన్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాస్‌రావు, తదితరులు


పాల్గొన్న అధికారులు, తదితరులు

నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యంతో రోడ్డు ప్రమాదాలు

- జిల్లా జడ్జి సునీత కుంచాల
- మైనర్లకు వాహనాలు ఇచ్చి శిక్షలకు గురికావద్దని తల్లిదండ్రులకు హితవు
- న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు
- పంద్రాగస్టు తర్వాత హెల్మెట్ నిబంధనను తప్పనిసరి చేస్తాం
- సీపీ కల్మేశ్వర్ స్పష్టీకరణ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని ఎంతోమంది నిండు ప్రాణాలను కోల్పోతున్నారని నిజామాబాద్ జిల్లా జడ్జి సునీత కుంచాల, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఆవేదన వ్యక్తం చేశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా పోలీస్ శాఖ సౌజన్యంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం 'మైనర్ డ్రైవింగ్ - డ్రంకెన్ డ్రైవింగ్' అంశంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా జడ్జి సునీత కుంచాల ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిన ఆవశ్యకతపై నొక్కి చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా అతివేగంగా వాహనాలు నడపడం, మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం వంటివి రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం అవుతున్నాయని అన్నారు. ముఖ్యంగా 18 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన మైనర్లు వాహనాలు నడుపుతూ ప్రమాదాలను కొనితెచ్చు కుంటున్నారని, వ్యక్తిగతంగా వారి కుటుంబాలతో పాటు సమాజానికి, ఇతరులకు కూడా తీరని నష్టం చేకూరుస్తున్నారని ఆందోళన వెలిబుచ్చారు. దీనిని నివారించాలని లక్ష్యంతో ప్రభుత్వం కఠిన చట్టాలను అమలులోకి తెచ్చిందని, మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులు కూడా నేరస్థులుగా పరిగణించబడతారని అన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే, వారితో పాటు తల్లిదండ్రులకు కూడా చట్ట ప్రకారం మూడేళ్ళ కారాగార శిక్ష, రూ. 25 వేల వరకు జరిమానా విధించబడుతుందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎట్టి పరిస్థితుల్లోనూ మైనర్లకు వాహనాలు నడిపేందుకు అనుమతించకూడదని, లైసెన్స్ కలిగిన వారు మాత్రమే వాహనాలు నడపాలని జిల్లా జడ్జి హితవు పలికారు. నేటి సమాజంలో అత్యధికమంది యువకులు, విద్యార్థులు రోడ్డు ప్రమాదాల గురించి ఏమాత్రం పట్టింపులేనితనం ప్రదర్శిస్తున్నారని, ఇష్టారీతిన వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారకులై నిండు ప్రాణాలు కోల్పోతున్నారని, ఎదుటివారికి నష్టం చేకూరుస్తున్నారని అన్నారు. మనపై కుటుంబం ఆధారపడి ఉందని గమనించి బయటికి వెళ్ళేటప్పుడు తప్పక ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, లేకుంటే కుటుంబం మొత్తం చిన్నాభిన్నం అయ్యే దుస్థితి నెలకొంటుందని అన్నారు. దేశంలో రోడ్డు ప్రమాదాల వల్ల ప్రతి గంటకు 19 మంది మృత్యువాత పడుతున్నారని, ఇది ఎంతో ఆందోళన కలిగించే అంశమని, ప్రతి ఒక్కరు దీని గురించి ఆలోచించాలని హితవు పలికారు.

పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్, సీటు బెల్టు ధరించకపోవడం, అతివేగం, రాంగ్ సైడ్ డ్రైవింగ్, ఓవర్ టేక్ చేయడం, సెల్ ఫోన్ డ్రైవింగ్, సామర్థ్యానికి మించి ఎక్కించుకోవడం, రాంగ్ సైడ్ వెళ్లడం, సిగ్నల్స్ జంప్ చేయడం తదితర కారణాల వల్ల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. నిజామాబాద్ జిల్లాలో గడిచిన ఏడాదిన్నర కాలం లోనే రోడ్డు ప్రమాదాలలో 550 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. దేశవ్యాప్తంగా చూస్తే, 2018 నుండి 2022 వరకు ఐదేళ్ల వ్యవధిలో 22.15 లక్షల వరకు రోడ్డు ప్రమాద ఘటనలు చోటుచేసుకుని, 8 లక్షల మంది అకాలమరణం చెం దారని సీ.పీ ఆవేదన వెలిబుచ్చారు. జిల్లా కేంద్రమైన నిజామాబాద్ నగర జనాభా మూడున్నర లక్షలు కాగా, ప్రమాదాలలో అంతకు రెట్టింపు సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారంటే రోడ్డు ప్రమాదాల తీవ్రత ఏ స్థాయిలో ఉందనేది అర్థం చేసుకోవచ్చని అన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం ప్రమాదాల పెచ్చుమీరేందుకు కారణమవుతోందని ఆక్షేపించారు.

వచ్చే ఆగస్టు 15 తరువాత హెల్మెట్ నిబంధనను తప్పనిసరి చేస్తామని, హెల్మెట్ ధరించని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సదస్సులో టీ.జీ.ఎస్.పీ 7వ బెటాలియన్ కమాండెంట్ రోహిణీ ప్రియదర్శిని, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, ఆర్మూర్ ఏ.సీ.పీ బస్వారెడ్డి, బోధన్ ఏ.సీ.పీ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ఆయా కళాశాలల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో బాలుడి కిడ్నాప్

- మెట్‌పల్లిలో గుర్తించిన పోలీసులు
- ఆస్పత్రిలో పర్యవేక్షణ కరువు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నుంచి శనివారం తెల్లవారు జామున మూడేళ్ల బాలుడు కిడ్నాప్ ఘటన జిల్లాలో కలకలం రేపింది. అయితే బాలుడిని మెట్‌పల్లి లో పోలీసులు గుర్తించారు. కాగా జిల్లా ఆస్పత్రిలో పర్య వేక్షణ కరువైనట్టు ఆరోప ణలు వ్యక్తమవు తున్నాయి.


ఇద్దరు అనుమానితులు సీసీ ఫుటేజ్

వివరాలు మెయిన్‌లో..

డీఎంఅండ్‌హెచ్‌వోగా డాక్టర్ రాజశ్రీ


నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా వైద్యాధికారిగా డాక్టర్ రాజశ్రీని నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ సివిల్ సర్జన్‌గా



విధులు నిర్వర్తించిన డాక్టర్ రాజశ్రీ.. పూర్తిస్థాయి జిల్లా వైద్యాధికారిగా రానున్నారు.

దీంతో ఇన్‌చార్జిల పాలనకు స్వస్తిపలికినట్టయింది.


గతేదాది జూలై 21న పొంగిన పోచారం ప్రాజెక్టు

నాడు పొంగినా.. నేడు నిండలే

- గతేడాది ఇదే సమయానికి పొంగిపొర్లిన పోచారం ప్రాజెక్టు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

వానాకాలం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా.. భారీ వర్షాలు లేక చెరువులు, కుంటలు, కాలువలు, ప్రాజెక్టులు వెలవెలబోతు న్నాయి. గతేడాది జూలై 21వ తేదీనా పోచారం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండి పొంగిపొర్లింది. కానీ ఈసారి నీరు లేక వెలవెలబోతోంది. రెండు నెలల నుండి వర్షాలు ముఖం చాటేయగా.. గత రెండు రోజుల నుంచి చిరుజల్లులు కురుస్తున్నాయి.

ఇప్పటికే గత సంవత్సరం నాట్లన్నీ పూర్తి చేసుకున్న రైతులు ప్రస్తుతం రెండు రోజుల నుండి కురుస్తున్న వర్షానికి నాట్లలో నిమగ్నమయ్యారు. రెండు రోజుల నుండి ప్రారంభమైన వర్షానికి పోచారం నిండుతుందా పొంగిపొర్లుతుందా..? పోచారం పైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు.



కాలనీల్లో నీరు నిలవకుండా చూడాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని ఏ కాలనీలో కూడా నీరు నిలవకుండా చూడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందు ప్రియ చంద్రశేఖర్ రెడ్డి అధికారులకు, సిబ్బందికి సూచించారు. అశోక్‌నగర్ మెయిన్‌రోడ్‌లోని 40,15,17 వార్డులో చైర్‌పర్సన్ దగ్గర డ్రయినేజీ శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేడు ఎడతెరిపి లేకుండా కురు స్తున్న వర్షానికి నీరు రోడ్లపైకి రావడంతో 20 మంది కార్మికుల బృందంతో రోడ్లను, మురి కాలువలను, శుభ్రం చేయించినట్టు తెలిపారు. ఈ పనులను మున్సిపల్ అధికారులకు ఎప్పటి కప్పుడు శుభ్రత చేస్తూ ఉండాలని మున్సిపల్ సిబ్బందినీ ఆదేశించారు.

పారిశుధ్య నిర్వాహనకు అత్యంత ప్రాధాన్యతాన్నిస్తున్నా మని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో, మున్సిపల్ కమిషనర్ సుజాత,వార్డ్ కౌన్సిలర్, భాస్కర్ గౌడ్,చాట్ల వంశీ, వనిత రామ్మోహన్, పాత శివ కృష్ణమూర్తి,మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.


అశోక్‌నగర్ మెయిన్‌రోడ్డును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందు ప్రియ

రేపటి నుంచి పాఠశాల పని వేళల్లో మార్పు

ఇకపై బడి ఉదయం 9 నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/ఏర్గట్ల



ప్రభుత్వ విద్యాసంస్థల సమయ వేళలు మారుస్తూ రాష్ట్ర విద్యాశాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రాథమిక పాఠశాలల సమయానికి అనుగుణంగా హైస్కూల్ సమయ వేళలు మారుస్తున్నట్టు విద్యాశాఖ ప్రకటించింది. గతంలో హై స్కూల్ సమయ వేళలు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు కొనసాగగా, ప్రస్తుతం వాటిని ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటలకు మార్చారు. ఈ నెల 22వ తేదీ సోమవారం నుంచి అమల్లోకి రానున్నాయి.

విద్యాశాఖ ఉత్తర్వుల ప్రకారం నిజామాబాద్ జిల్లాలోని ఉన్నత పాఠశాలల పని వేళలు పాటించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్ వి దుర్గాప్రసాద్ తెలిపారు. ఉన్నత పాఠశాల పని వేళలు ఉదయం 9 గంటల 30 నిమిషాల నుంచి సాయంత్రం 4 గంటల 45 నిమిషాల బదులుగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల 15 నిమిషాల వరకు నిర్ధారించినట్టు తెలిపారు. సోమవారం నుంచి ఈ పని వేళలు అమలవుతాయని తెలిపారు.

ఏర్గట్ల : రాష్ట్ర ప్రభుత్వాదేశాను సారం ఈ నెల 22 సోమ వారం నుండి మండలం లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల పనివేళలు మార్చడం జరుగుతుందని ఎంఈఓ ఆంద్రయ్య తెలిపారు. ఉన్నత, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు అన్ని ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4.15 నిమిషాల వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు.

ప్రాథమిక పాఠశాల పనులు పరిశీలన

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని తొర్లికొండ ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కింద మంజూరై పూర్తయిన పనులను ఎంపీడీఓ సతీష్ శనివారం పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పిఆర్ఏఈ సురేంద్రవర్మ, ప్రధానోపాధ్యాయులు జంగం అశోక్, సిఆర్పీ వేముల నగేష్, జిపి కార్యదర్శి రాజేశ్వర్, కారోబార్‌లు సుభాష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఉరుములు పిడుగులకు కాలిపోయిన టీవీలు, ఫ్యాన్లు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని రాజరాజేశ్వరి నగర్‌లో శుక్రవారం రాత్రి ఉరుములు మెరుపులతో కురిసిన వర్షానికి పడ్డ పిడుగుల వల్ల గ్రామంలోని పలు ఇండ్లలోని ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయి. ఒక్కసారిగా వచ్చిన ఉరుములతో కూడిన పిడుగుల వల్ల పలువురు ఇండ్లలో టీవీలు, ఫ్యాన్లు, రిఫ్రిజిరేటర్లు, ట్యూబ్ లైట్లు తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. పిడుగుల వల్ల ఇండ్లలోని ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోవడం మూలంగా వేలల్లో నష్టం వాటిల్లినట్లు పలువురు బాధితులు వాపోయారు. పిడుగుపడిన సమయంలో తమ ఇంట్లో నడుస్తున్న టీవీ ఒక్కసారిగా పొగలు వచ్చి మాడిపోయినట్లు అయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇంట్లోనే రెండు ఫ్యాన్లు, మూడు ట్యూబ్‌లు కూడా కాలిపోయినట్లు తెలిపాడు.



దెబ్బతిన్న టీవీ

శుభ్రత పాటిస్తూ ఆహారాన్ని అందించాలి

- మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్



పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారి శ్రీనివాస్

నవతెలంగాణ-ధర్పల్లి

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని శుభ్రత పాటిస్తూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో మోడల్ పాఠశాలలోని విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని వంటగది ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నాణ్యమైన కూరగాయలతో పాటు విద్యార్థులకు మెనూ ప్రకారం వేడి వేడి భోజనాన్ని అందించాలని సూచించారు. ఈగలు ఉండకుండా పాత్రలను శుభ్రంగా ఉంచుకోవాలని, వ్యాధులపట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఓ బాలకృష్ణ, గ్రామ కార్యదర్శి సైఫొద్దీన్, పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్ర సాహు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చౌట్‌పల్లి ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం



మాట్లాడుతున్న మండల విద్యాధికారి ఆంధ్రయ్య

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని చౌట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి ఆంధ్రయ్య అధ్యక్షతన తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు. 90మంది విద్యార్థుల తల్లిదండ్రులు హాజరైన ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. విద్యార్థులలో క్రమశిక్షణ, ప్రవర్తనలో రావాల్సిన మార్పులను, విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి కల్పించాలని చర్చించారు. పిల్లల ప్రగతికై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సహకరించుకొని జిల్లాలోనే మంచి మార్కులు సాధించేలా ప్రయత్నం చేయాలని నిర్ణయించారు. మధ్యాహ్న భోజన పనితీరుపై, ఉపాధ్యాయుల పనితీరు, తల్లిదండ్రుల బాధ్యతపై చర్చించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడడం, ఇంటి వద్ద పిల్లల పనితీరు, చదువుకోవడానికి మంచి వాతావరణం కల్పించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు శ్రీనివాస్, బంతిలాల్, రాజు, మధు, వర్ష, శ్రీలత, శ్రీనివాస్, ప్రవళిక, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ బాల్కొండ ఫోర్ట్ నూతన కార్యవర్గం ఎన్నిక



సెర్మనీ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-బాల్కొండ

లయన్స్ క్లబ్ ఆఫ్ బాల్కొండ ఫోర్ట్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. ముప్కాల్ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో లయన్స్ క్లబ్స్ ఇన్స్టాలేషన్ సెర్మని కార్యక్రమం నిర్వహించారు. ఆ సంస్థ ఫస్ట్ వీడిజిప అనంతరావు నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ బాల్కొండ ఫోర్ట్ అధ్యక్షుడిగా అందే వెంకటగిరి, కార్యదర్శిగా ద్యావతి పోశెట్టి, కోశాధికారిగా కటికే శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐపి డిస్ట్రిక్ గవర్నర్ పి.లక్ష్మి, రీజియన్ సెక్రటరీ నరసయ్య లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బహుజన లెఫ్ట్ పార్టీ జిల్లా అధ్యక్షురాలిగా సబ్బని లత

- ప్రధాన కార్యదర్శిగా అబ్బగోని అశోక్‌గౌడ్ ఎన్నిక

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బహుజన లెఫ్ట్ పార్టీ జిల్లా అధ్యక్షురాలిగా సబ్బని లత, ప్రధాన కార్యదర్శిగా అబ్బగోని అశోక్‌గౌడ్ ఎన్నికయ్యారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లో గల బహుజన లెఫ్ట్ పార్టీ(బహుజన కమ్యూనిస్టు) బిఎల్‌పి జిల్లా కార్యాలయంలో సబ్బని లత అధ్యక్షతన జరిగిన పార్టీ జిల్లా జనరల్ బాడీ సమావేశానికి బహుజన లెఫ్ట్ పార్టీ- బిఎల్‌పి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ పర్యవేక్షణలో 17 మందితో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలుగా సబ్బని లత, ఉపాధ్యక్షులుగా టి.రాజు, సాయి కుంభే, ప్రధాన కార్యదర్శిగా అబ్బగోని అశోక్ గౌడ్, సహయ కార్యదర్శులుగా బి.జగదీష్, ఎం.డి.సయ్యద్, కోశాధికారిగా దండు జ్యోతి, జిల్లా కమిటి సభ్యులుగా రాజేందర్, శంకర్, మోహన్ గౌడ్, యాదయ్య, గీతాంజలి, బాల్‌రాజ్, సుజాత, జి.శ్రీమాన్, ఎం.అజయ్, చంద్రగౌడ్‌ను ఎన్నుకున్నారు.

అనుమతి లేకుండా అధికారులు హెడ్‌క్వార్టర్ దాటొద్దు

- నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మకరంద్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్‌లో భారీ వర్షాలు ఉన్నందున ఎలాంటి అనుమతి లేకుండా అధికారులు నిజామాబాద్ హెడ్ క్వార్టర్‌ను వదిలి వెళ్ళకూడదని నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మకరంద్ తెలియజేశారు. శనివారం నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మకరంద్ భారీ వర్షాల కారణంగా రెడ్ అలర్ట్ ఉన్నందున జోన్ 5కి సంబంధించిన ఏఈ, సానిటరీ ఇన్‌స్పెక్టర్ మహిపాల్‌తో రిహాబిడేషన్ సెంటర్స్ బాబంసపహాడ్‌లో లైనింగ్ ఏరియాస్, బోధన్ రోడ్ పలు ప్రాంతాలను సందర్శించారు. సంబంధిత అధికారులు అనుక్షణం అందుబాటులో ఉండాలని సూచించారు. ఎలాంటి అనుమతి లేకుండా అధికారులు హెడ్‌క్వార్టర్ వదిలి వెళ్లొద్దని సంబంధిత శాఖ అధికారులకు తెలియజేశారు.



జోన్ 5లో పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మకరంద్

నగరంలోని లాడ్జిల్లో పోలీసుల విస్తృత తనిఖీలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగనావర్ ఆదేశాల మేరకు సిసిఎస్ ఏసిపి బోనాల కిషన్ ఆధ్వర్యంలో నిజామాబాద్ పట్టణంలోని పలు లాడ్జీలలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు.

నగరంలోని లాడ్జీలలో చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరగకుండా వాటిని నిరోధించడానికి ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఉమెన్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత, పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరహరి, నాలుగోటౌన్ ఎస్‌హెచ్‌ఓ పాండేరావు, వారి సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నూతన ప్రభుత్వ హయాంలో పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం (ఏఐపిఎస్యు) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏఐపిఎస్యు నగర కార్యదర్శి సందీప్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐపిఎస్యు జిల్లా కార్యదర్శి బోడ అనిల్ మాట్లాడుతూ.. ఈనెల 23వ తేదీ నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలలో విద్యారంగ సమస్యల పరిష్కారం దిశగా చర్చించి పెండింగ్‌లో ఉన్న రూ.8214.57 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల చేయాలని అన్నారు. దీంతోపాటు కొఠారి కమిషన్ ప్రకారం మొత్తం బడ్జెట్లో 30శాతం నిధులు కేటాయించి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసే రకంగా నూతన ప్రభుత్వం చొరవ చూపించాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్ భవనాలను పునర్నిర్మించాలని గత ప్రభుత్వం ప్రకటించినటువంటి హాస్టల్, మెస్‌చార్జీలు, కాస్మోటిక్ చార్జీలను పెంచి వెంటనే అమలుచేసే విధంగా నూతన ప్రభుత్వం జీవో జారీ చేయాలని అన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం, పిడిఎస్యు జిల్లా కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్, టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు యూసుఫ్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరేష్ పాల్గొని తమ అభిప్రాయాలను తెలిపారు.



మాట్లాడుతున్న ఏఐపిఎస్‌యు నాయకులు

రైతుబీమా దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-రెంజల్

(ఫార్మర్స్ గ్రూప్ లైఫ్ ఇన్సూరెన్స్) రైతుబీమాకు ఈనెల 28 లోపు దరఖాస్తులు చేసుకోవాలని రెంజల్ మండల వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపారు. సంవత్సరంలో ఒకసారి మాత్రమే ఈ రైతు బీమాకు అవకాశం ఉందని జూన్ 28లోపు కొత్త పట్టాపాస్ పుస్తకాలు కలిగిన వారు స్థానిక వ్యవసాయ విస్తీర్ణ అధికారుల వద్దకు వెళ్లి ఆన్లైన్ చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ పథకంలో చేరేందుకు 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాలలోపు వయసు కలిగి ఉండాలని ఆయన అన్నారు. 14 ఆగస్టు 1965 నుంచి 14 ఆగస్టు 2006 లోపు వయసు కలిగిన వారు అర్హులని ఆయన పేర్కొన్నారు. ఆధార్ కార్డు పుట్టిన తేదీ మాత్రమే పరిగణలోనికి తీసుకోబడుతుందన్నారు. జూన్ 28 లోపు గలవారు ఈ దరఖాస్తులకు అర్హులని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల పనివేళలో మార్పులు

- మండల విద్యాధికారి ఆంధ్రయ్య

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలల పనివేళల్లో మార్పులు చేసినట్టు మండల విద్యాధికారి ఆంధ్రయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నత పాఠశాలలు కూడా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల వలెనే ఉదయం 9గంటల నుంచి సాయంకాలం 4:15 గంటల వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. కమ్మర్‌పల్లి, మోర్తాడ్, ఏర్గట్ల మండలాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు 22వ తేదీ సోమవారం నుంచి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పాఠశాలలు నడపాలని మండల విద్యాధికారి ఆంధ్రయ్య తెలిపారు.

వాహనదారులు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలి

- ఎంవీఐ వివేకానందరెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

వాహనదారులందరూ తమ వాహనాలకు ఇన్సూరెన్స్ తప్పనిసరిగా చేయించుకోవాలని ఎంవిఐ వివేకానందరెడ్డి తెలిపారు. ఈనెల 3వ తేదీ కమిషనర్ ఆదేశానుసారం థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ అనేది తప్పనిసరి అని, వాహనం ద్వారా ఇతరులకు గాయం తగిలితే ఇన్సూరెన్స్ కంపెనీ భరిస్తుందని, పర్సనల్ ఇన్సూరెన్స్ అనేది ఒక వెయ్యి నుంచి 1500 కట్టినచో 15లక్షల వ్యక్తిగత ప్రమాద బీమా కవర్ అవుతుందని తెలిపారు. వాహనాల తనిఖీల్లో భాగంగా ఇన్సూరెన్స్ లేనట్లయితే మొదటిసారిగా మూడు నెలల జైలు శిక్షతో పాటు రెండు వేల జరిమానా, రెండవసారి మూడు నెలల జైలు శిక్షతో పాటు నాలుగు వేల జరిమానా లేదా రెండు కలిపి వేయవచ్చని తెలిపారు. తనిఖీలు ముమ్మరం చేస్తామని, హెల్మెట్, వాహన ధ్రువపత్రాలు దగ్గర ఉంచుకోవాలని తెలిపారు.



మాట్లాడుతున్న ఎంవీఐ వివేకానందరెడ్డి

పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి

- పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన



నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ కేంద్రంలో గల ప్రభుత్వ మోడల్ స్కూల్, బాలికల కస్తూర్బా పాఠశాల కళాశాలలో సమస్యలు కుప్పలు తిప్పలుగా ఉన్నాయని వాటిని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పరిష్కరించడం లేదని పీడీఎస్‌యూ నాయకులు తెలిపారు. దానిని నిరసిస్తూ అధికారుల తీరుకు వ్యతిరేకంగా పీడీఎస్‌యూ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో శనివారం వర్షంలో మోడల్ స్కూల్ ముందు, మున్సిపల్ కమిషనర్ ఆఫీస్ ఎదుట వర్షంలో కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు ఏరియా అధ్యక్షులు అనిల్ కుమార్, ఏరియా ప్రధాన కార్యదర్శి నిఖిల్ మాట్లాడుతూ.. పట్టణ కేంద్రంలో ప్రభుత్వ మోడల్ బాలికల కస్తూర్బా పాఠశాల కళాశాలలో వందలాది మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తారని, వారికి ఎలాంటి ఆటంకం లేకుండా ఇక్కడ విద్యాధికారులు మున్సిపల్ అధికారులు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, కానీ సంవత్సరాలు గడుస్తున్నా సమస్యను పరిష్కరించలేదన్నారు. కస్తూర్బా కళాశాలలో అడవిని తలపించేలా చెట్లు చెదలు గడ్డి ఉన్నాయని వాటనీ పరిష్కరించలేదన్నారు. కార్యక్రమంలో నాయకురాలు సిద్ధార్థ, మమత తదితరులు పాల్గొన్నారు.

ఈరవత్రి అనిల్‌కు కాంగ్రెస్ శ్రేణుల ఘన స్వాగతం



ఈరవత్రి అనిల్‌కు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి మొదటిసారి కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి విచ్చేసిన ఈరవత్రి అనిల్‌కు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్‌ను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకెట రవి పూలమాల వేసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పూజారి శేఖర్, పద్మశాలి సంఘం మండల అధ్యక్షులు చింత తిరుపతి, సంతోష్ నాయక్, సంపంగి నాగరాజు, ఉప్లూర్ పద్మశాలి సంఘం అధ్యక్షులు పోతు మురళి, జిందం హరికుమార్, హాసకొత్తూర్ పద్మశాలి సంఘం అధ్యక్షులు నాయిని పురుషోత్తం, శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద బ్రాహ్మణ యువకునికి ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న బ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని వినాయక్‌నగర్‌లోని సాయినాథ్ టవర్స్‌లో బంధువుల ఇంటిలో నివాసముంటున్న కిషన్‌రావు ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆయన భార్య శిల్ప గతంలో సింధ్‌క్లాత్ ఎంపోరియంలో పనిచేస్తూ ఉండేది. ఆమె గతంలోనే కోవిడ్‌తో చనిపోవడంతో కిషన్‌రావు ఆటో నడుపుతూ ఇంటిని పోషిస్తున్నాడు. ఉండడానికి ఇల్లు కూడాలేక ఆయన కుమారుడు వెంకట సాయి పురోహిత్యం చేస్తూ తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. పూజారిగా పనిచేస్తున్న వెంకట సాయి కొన్ని రోజుల క్రితం పూజా కార్యక్రమానికి వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాల పాలై వెన్నుముక దెబ్బతింది. లేవలేని పరిస్థితిలో మంచానికే పరిమితమై దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నాడు. ఈ పరిస్థితిని తెలుసుకొని తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షులు కిరణ్ దేశ్ ముఖ్ వారి కార్యవర్గ సభ్యులు ముందుకు వచ్చి ఆ కుటుంబానికి తమవంతు సహాయంగా రూ.60వేలు శనివారం అందజేశారు. బ్రాహ్మణ సంగం అధ్యక్షులు కిరణ్ దేశ్‌ముఖ్ మాట్లాడుతూ.. ఈ నిరుపేద బ్రాహ్మణ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి రొట్టె సురేష్ శర్మ, కోశాధికారి పుల్కల్ రమేష్, ఉపాధ్యక్షులు ఉదయ్, భోదంకర్, పురుషోత్తమ్ పట్వారి, సంఘం సభ్యులు మెడిచర్ల శ్రీనాథ్, లక్ష్మీనారాయణ భరద్వాజ్, మల్లికార్జునరావు, అమరేశ్వర్ వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో పలువురు నాయకులను కలిసిన ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి



నవతెలంగాణ-ఆర్మూర్

ఢిల్లీలో బిజెపి జాతీయ సంఘటన ప్రధాన కార్యదర్శి బి.ఎల్. సంతోష్‌ను స్థానిక ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్ర మంలో బిజెపి జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులచారి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, జగిత్యాల జిల్లా అధ్యక్షులు మోరెపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శీతల శవపేటిక అందజేత



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శీతల శవపేటిక అందజేత

నవతెలంగాణ-కంఠేశ్వర్

లయన్ సహారా నిజామాబాద్ ఆధ్వర్యంలో మోపాల్ మండల కేంద్రంలో గ్రామాభివద్ధి కమిటీ సభ్యులకు శనివారం శీతల శవపేటికను అందజేసినట్టు జిల్లా కార్యదర్శి ఉదయ సూర్య భగవాన్ తెలిపారు. లయన్ సహారా ద్వారా మరిన్ని సేవలు అందిస్తామని లయన్ అధ్యక్షులు నరసింహారావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ధనుంజయరెడ్డి, సింగిల్‌విండోస్ చైర్మన్ రామచంద్రగౌడ్, గ్రామ అభివద్ధి కమిటీ అధ్యక్షులు అంజయ్య, కార్యదర్శి అంకం గిరి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో గ్రంథాలయం లేదని సభ్యులు తెలపడంతో లయన్స్ తరఫున పుస్తకాలు, ఫ్యాన్లు అందజేస్తామని తెలిపారు.


నేడు సాయిబాబా ఆలయంలో గురు పూర్ణిమా

నవతెలంగాణ-పోతంగల్

గురు పూర్ణిమ సందర్భంగా మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ఆదివారం ఉదయం అభిషేకం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.



మర్డర్ కేసు చేధన



వివరాలు వెల్లడిస్తున్న ఏసిపి రాజా వెంకటరెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగనవార్ ఆదేశాల మేరకు నిజామాబాద్ ఏసిపి రాజా వెంకటరెడ్డి ఆధ్వర్యంలో నిజామాబాద్ పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరహరి మర్డర్ కేసును ఛేదించారు. వివరాల్లోకి వెళితే.. వినాయక్‌నగర్‌లో బుధవారం మురళి హోటల్ ముందు జరిగిన మర్డర్ కేసులో నిందితుడు సాయికుమార్‌ను నమ్మకమైన సమాచారం మేరకు అమ్మ వెంచర్ దగ్గర ఒక డెయిరీ ఫార్మ్ వద్ద పట్టుకొని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. ఆరోజు రాత్రి వంశీ వినాయక లిక్కర్ మార్ట్ యందు మద్యం సేవిస్తూ ఉండగా నిందితుడు మూత్రవిసర్జనకు వెళ్లగా.. మృతుడు ఆనంద్ బిహారి పాండే వెనకాల నుంచి నెట్టివేయగా నిందితుడు సాయికుమార్ కింద పడిపోయాడు. ఆ విధంగా ఇద్దరి మధ్య చిన్నపాటి ఘర్షణ తర్వాత మద్యం సేవించిన తర్వాత మద్యం షాపు నుంచి బయటికి వచ్చి తిరిగి అదే విషయంలో గొడవ పడగా నిందితుడు మృతుడిని గొంతు పట్టి వెనుకకు నెట్టి వేయగా మృతుడు వెల్లకిలా పడిపోవడంతో తలకు వెనుక భాగంలో తీవ్ర గాయమైంది. పక్కనే ఉన్న ఓ రాయిని తీసుకొని ముఖంపై ఎత్తివేయగా తీవ్ర గాయం కావడంతో రక్తస్రావం జరిగి ఆనంద్ బిహారీ పాండే అక్కడికక్కడే చనిపోయారు. ఈ కేసును చేధించడంలో 4వ పట్టణ ఎస్‌హెచ్‌ఓ పాండేరావు, ఏఎస్ఐ సాయిలు, సిబ్బంది మనోజ్, అనిల్, బాలాజీ, భూరాజ్, సంగేస్, నారాయణ, రవి, రమేష్, రాకేష్ ప్రతిభ కనబరిచారు.

నవతెలంగాణ
3
కామారెడ్డి
ఆదివారం | జులై 21, 2024 | www.navatelangana.com

నడిరోడ్డులో గుంత

- ప్రమాదాలు జరగకుండా పాతిన ఇనుప కడ్డీ దిమ్మె

నవతెలంగాణ-మద్నూర్



మండల కేంద్రంలో ప్రధాన రహదారి మధ్యలో భారీ గుంత పడింది. గుంత పక్కన వర్షపు నీళ్ల నిలవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ఎవరో నడిరోడ్డు గుంతలో ప్రమాదాలు జరగకుండా ఇనుప కడ్డీ దిమ్మెను పెట్టి కొమ్మలు కట్టారు. గుంత పక్కన వర్షపు నీరు నిలవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఈ గుంతను వెంటనే పూడ్చివేయాలని మండల కేంద్ర ప్రజలు రహదారి అధికారులను కోరుతున్నారు.

అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట

నవతెలంగాణ-రామారెడ్డి



మండలంలోని మద్దికుంటలో అంగన్వాడీ ఆధ్వర్యంలో అమ్మ మాట.. అంగన్వాడీ బాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లు మాట్లాడుతూ.. అంగన్వాడీలో ఒత్తిడి లేకుండా ఆటపాటలతో కిశోర బాలలకు విద్యాబోధన ఉంటుందని, పౌష్టికాహారం అందిస్తున్నామని, 3సంవత్సరాల నుంచి 5సంవత్సరాలలోపు పిల్లలను అంగన్వాడీలో చేర్పాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు బొమ్మిడి సుజాత, గజ్జల సుజాత, మూడ వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను నిత్యం పర్యవేక్షించాలి

- రెగ్యూలర్‌గా స్కూల్‌కు పంపాలి
- పలు స్కూళ్లల్లో పేరెంట్ కమిటీ సమావేశం

నవతెలంగాణ-విలేకరుల బృందం

విద్యార్థుల హాజరుశాతాన్ని పెంపొందించాలి..

పిట్లం : విద్యార్థుల హాజరు శాతాన్ని పెంపొందించాలని మండల విద్యాధికారి దేవి సింగ్ అన్నారు. శనివారం మండలంలోని కుర్తి ప్రాథమికోన్నత పాఠశా లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని సూచించారు. అంకిత భావంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన చేయాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించారు. పిల్లల ప్రగతిని తరగతి గదిలో వెళ్లి పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనము అందించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. రోజువారి మధ్యాహ్న భోజన వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేయాలన్నారు. ప్రతి విద్యార్థి ముఖ గుర్తింపు హాజరు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విట్టల్ రావు , నాగమణి , శ్యామా గౌడ్, శిల్పా తదితరులు పాల్గొన్నారు.

పిల్లల హోం వర్క్ పరిశీలంచాలి

సదాశివనగర్ : సదాశివనగర్ మండలంలోని మోడల్ పాఠశాలలో శనివారం తల్లి తండ్రుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ రాజేందర్ మాట్లాడుతూ పిల్లల ను తల్లి తండ్రులు పాఠశాల ఉపాధ్యాయులు ఇచ్చిన హోం వర్క్ చేయించాలని సూచించారు. పిల్లల సేల్ ఫోన్‌లకు దూరంగా ఉంచాలని అన్నారు. పాఠశాలలో మధ్యాహ్నం భోజనం కొందరు తినడం లేదని వారి దృష్టికి తీసుకెళ్లారు. క్రమం తప్పకుండ విద్యార్థుల పాఠశాల కు పంపాలని సూచించారు.



నిజాంసాగర్‌లో మాట్లాడుతున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం



జుక్కల్ మండలం పడంపల్లిలో మాట్లాడుతున్న హెచ్‌ఎం

తల్లితండ్రులు తమ పిల్లల అభివృద్ధికి సహకరించాలి

నిజాంసాగర్ : తల్లిదండ్రులు తమ పిల్లల అభివృద్ధికి సహకరించాలని నిజాంసాగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాంచందర్ అన్నారు. శనివారం రోజు పాఠశాల పిల్లల తల్లిదండ్రులతో సమావేశం ఉపాధ్యాయులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడి నిర్వహణ, బడి అభివృద్ధికి సంబంధించిన పనులలో విద్యార్థులు తల్లిదండ్రులు స్వచ్ఛందంగా పాల్గొని పనులు చేపట్టాలని ఆయన అన్నారు. విద్యార్థులు ఇంట్లో చదువుకునేందుకు వీలుగా ఇంట్లో ఒక ప్రదేశాన్ని వారికి ఏర్పాటు చేయాలని ఆయన తల్లిదండ్రులకు సూచించారు. బడిలో పిల్లలు నేర్చుకున్న అంశాలను ఇంటింటా చదువుల పంట అనే యాప్ ద్వారా విశ్లేషించుకోవచ్చని ఆయన తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను ఎప్పుడు కనిపెట్టుకుంటూ ఉండాలని పిల్లలు సమయానికి పాఠశాలకు వెళ్తున్నారా ఏలా చదువుకుంటు న్నారని రోజువారి విషయాలను పరిశీలించాలని ఆయన తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, రక్షణ కాంత్, షాదుల్లా రాజేందర్, రాములు, సీఆర్పీలు నర్సింలు, శ్రీధర్ కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లల్లోనే నాణ్యమైన విద్య

మద్నూర్ : ప్రభుత్వ స్కూళ్లల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని మండలంలోని అంతాపూర్ ప్రాథమిక పాఠశాల చైర్మన్ లక్ష్మిబాయి తెలిపారు. శనివారం పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ లక్ష్మీబాయి పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ యాదవ్ రావు మరో ఉపాధ్యాయులు అభిలాష్ పాల్గొని పిల్లల చదువు తీరు పట్ల తల్లిదండ్రులతో వాకబు చేశారు.

బడి బయటి పిల్లలను బడిలో చేర్పించాలి

జుక్కల్ : మండలంలోని బస్వాపూర్ గ్రామంలోని ఎంపీయూపీఎస్ పాఠశాలో శనివారం హెచ్‌ఎం జయంచంద్ ఆధ్వర్యంలో పేరెంట్స్ సమావేశం నిర్వహించారు. పాఠశాలలోని విద్యనబ్యసిస్తున్న విద్యార్థులు పౌష్టికాహరం లోపంతో ఉన్న వారిని గుర్తించి ప్రత్యేకంగా వారికి వైద్యం తో పాటు తీసుకోవాల్సిన ఆహార నియమాలను వారి తల్లిదండ్రులకు సూచించారు. అదేవిధంగా బడి బయటి పిల్లలను బడిలో చెర్పించాలని, డ్రాప్ అవుట్ లేకుండా చూడాలని, పిల్లలను పనిలో పెట్ట వద్దని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జయచంద్, ఉపాధ్యాయులు, ఎల్‌ఎస్‌గౌడ్ , మధు, పిల్లల తల్లిదండ్రులు , గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరోజూ స్కూల్‌కు పంపాలి

మద్నూర్ : మద్నూర్ మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాల ధన్నూర్ లో శనివారం నాడు పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం ప్రధానోపాధ్యాయుడు ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించామని, పిల్లలకు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని తల్లిదండ్రులకు సూచించారు.

ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు పిల్లలపై శ్రద్ధ పెట్టాలి

పెద్దకొడప్‌గల్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం రోజు విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కమల అధ్యక్షత వహిస్తూ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు కమల మాట్లాడుతూ పాఠశాల నిర్వహణ విషయంలో ఉపాధ్యాయుల పాత్రతో పాటు తల్లిదండ్రుల పాత్ర ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రాజమణి, ఉపాధ్యాయబందంకిషోర్,ఉమాదేవి,సుదర్శన్ రెడ్డి, నాగనాథ్,రాజు,రవికుమార్,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బస్సులో నగదు చోరీ చేసిన తల్లీకూతురు

నవతెలంగాణ-భిక్కనూర్

ఆర్టీసీ బస్సులో తల్లీకూతుర్లు నగదు చోరీ చేసిన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ నుండి ఆర్మూర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు భిక్కనూర్ పట్టణానికి రాగానే కండక్టర్ నారాయణ తన ప్యాంటు జేబులో నుండి డబ్బులు దొంగలించబడినాయి. వెంటనే డబ్బులు పోయాయని కండక్టర్ అరవగా మరో ఇద్దరు ప్యాసింజర్లు తమ వద్ద కూడా డబ్బులు పోయాయని తెలిపారు. జంగంపల్లి గ్రామ శివారులో ఆర్టీసీ బస్సు ఆపి 100 కు డయల్ చేయగా పోలీసులు ఆర్టీసీ బస్సు వద్దకు చేరుకొని బస్సులో ఉన్న ప్రతి ఒక్కరిని తనిఖీలు చేశారు. అనుమాదాస్పదంగా ఇద్దరు మహిళలు తల్లి లక్ష్మి, కూతురు కవిత వద్ద మహిళా పోలీసులు పరిశీలించగా వారి వద్ద 15,100 రూపాయలు దొరికాయి. పోలీసులు తల్లి కూతుర్లను విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. కండక్టర్ ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

చెలరేగిన పొగమంటలు

విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తగిలడంతో..



విద్యుత్ తీగలు రాపిడికి గురికావడంతో వెలువడిన పొగమంట

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండల పరిధిలోని శివనగర్ గ్రామ సమీపంలో ప్రధాన రోడ్డుపై కరెంటు తీగలకు చెట్ల కొమ్మలు తగలడంతో నెమ్మదిగా పొగ మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి విద్యుత్ శాఖ వారికి సమాచారం ఇవ్వడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ ఘటన చోటుచేసుకుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షాకాలంలో విద్యుత్ సరఫరాకు ఇలాంటి ఆటంకాలు, అంతరాయం కలగకుండా ఉండేందుకు ప్రతి సంవత్సరం మే చివరి వారంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టే ప్రి మాన్ సూన్ చెకప్ కార్యక్రమంలో భాగంగా అన్ని ప్రాంతాల్లో విద్యుత్తు తీగలకు తాకే స్థితిలో ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే పనులు పకడ్బందీగా చేయించడంలో విఫలమవుతున్నారని విమర్శించారు. ప్రణాళిక బద్ధమైన విధానాల ద్వారా అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రీమాన్సూన్ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పనులు చేయడంలో విఫలం అవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కట్టు కాలువ పూడికతీత పనులు ప్రారంభం



కాలువ పూడికతీత పనులు చేపట్టిన సిబ్బంది

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండల కేంద్రంలోని సహకార సంఘం సమీపంలో గల కట్టు కాలువ చెత్తాచెదారంతో మట్టితో పూర్తిగా నిండిపోయింది. పూడికతీత పనులను శనివారం ఇరిగేషన్ అధికారులు ప్రారంభించారు. గ్రామంలోని సహకార సంఘం సమీపంలో గల ప్రధాన కట్టు కాలువ గత కొన్ని సంవత్సరాలుగా చీర పెంద్లకుంటతో పాటు వ్యవసాయ భూములకు సాగునీరు అందించేది. ప్రస్తుతం గత కొన్ని సంవత్సరాలుగా రోజురోజుకు కట్టు కాలువలో చెత్త చెదారము మట్టి కూరుకుపోయి పూర్తిగా నిండి పోయింది. వర్షాకాలంతో పాటు ఇతర కాలాల్లో నీరు నిల్వ ఉండడంతో దోమలు వ్యాపించి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. చీర పేర్లకుంటకు వెళ్లే కాలువ మట్టితో పేరుకపోవడంతో సాగునీరు పూర్తిగా నిలిచిపోయాయి. ఎట్టకేలకు శనివారం పూడికతను పనులు చేపట్టారు. మట్టితో నిండిపోయిన కట్టు కాలువ జెసిపి సాయంత్రం పూడికతను తీయడంతో చీర పేర్లకుంటతో పాటు సాగు చేసే రైతులకు సాగునీరు అందించవచ్చు అన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కామారెడ్డి

నియోజకవర్గ పరిధిలో ముఖ్యమంత్రి సహాయనిది సీఎం ఆర్‌ఎఫ్ కింద మొదట దరఖాస్తు చేసుకున్న 35 మందికి చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్దిదారులకు ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణరెడ్డి శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తరువాత తన కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న వారిలో 35 మందికి మొదటి విడతగా చెక్కులు వచ్చాయని తెలిపారు. ఎలాంటి పైరవీలు లేకుండా దరఖాస్తు చేసుకునే వారు నేరుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అన్ని పత్రాలు అందజేస్తే సాధ్యమైనంత వరకు ప్రభుత్వం నుంచి, ముఖ్యమంత్రి సహాయనిధి నిండి డబ్బులు వచ్చే విధంగా ప్రయత్నం చేస్తానన్నారు. ఇకపై వచ్చే సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులను మండలాల వారీగా వచ్చి మండల కేంద్రాల్లో ఇస్తామని పేర్కొన్నారు.

ఆలయానికి రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-లింగంపేట్



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మండలం సమీపంలో మత్తడి పోచమ్మ ఆలయం వరకు రోడ్డు నిర్మాణం పనులను ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు శనివారం ప్రారంభించారు. ఎన్నికల సమయంలో రోడ్డు వేయిస్తానని ఇచ్చిన మాట ప్రకారం పనులు ప్రారంభించినట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణం చేపట్టడం వల్ల ఆలయానికి వచ్చే వారికి సౌకర్యంగా ఉంటుందని అన్నారు. ఆలయ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బుర్ర నారా గౌడ్, యూత్ అధ్యక్షులు సుబ్బాల రాజు, కాంగ్రెస్ నాయకులు శంకర్ పంతులు, దురిశెట్టి అశోక్, నాగరాజు రాజు రవి, సాయిలు, ఆర్‌అండ్‌బి అధికారులతో పాటు ఆయా గ్రామాల తాజా మాజీ సర్పంచులు గ్రామ కమిటీ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-భిక్కనూర్



మండలంలోని సిద్ధ రామేశ్వర నగర్ గ్రామంలో శనివారం బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు రజిత, మధుమతి, పంచాయతీ కార్యదర్శులు సౌజన్య, సౌందర్య, రేణుక గ్రామంలోని శివాజీ సేన ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శివాజి సేన సభ్యులు అరుణ్, సిద్ధు, ఆనంద్, రాకేష్, సాయి, పవన్, డ్వాక్రా గ్రూప్ మహిళా సంఘం అధ్యక్షురాలు వరలక్ష్మి, రజిత, శివ లతా, రూప, సత్యవా, లతా పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడుతాం

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని కాస్లాబాద్, వడ్లం గ్రామాలలో గల పాఠశాలల్లో శనివారం పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు సంతోష్ మాట్లాడుతు ఉపాధ్యాయుల సమస్యల సాధన కోసం పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కిషోర్ సింగ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సుదర్శన్ రెడ్డి, కార్యదర్శి బస్వరాజ్ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీ కాలబైరవ స్వామి ఆలయాన్ని దర్శించుకున్న హైకోర్టు జడ్జి

నవతెలంగాణ-రామారెడ్డి



హైకోర్టు జడ్జికి సన్మానించి చిత్రపటం అందజేత

మండలం లోని ఈసన్న పల్లిలో వెలిసిన శ్రీ కాలబైరవ స్వామి ఆలయాన్ని హైకోర్టు జడ్జ్ శ్రీనివాసరావు శనివారం దర్శించుకు న్నారు. ఆలయ పూజారులు ఆయనకు పూర్ణ కుంభంతో స్వాగతం పలుకగా, ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కార్యనిర్వాహణా ధికారి ప్రభు, సిబ్బంది శాలువాతో సన్మానించి, స్వామివారి జ్ఞాపికను, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో కామారెడ్డి కోర్టు జడ్జీలు, ఆర్డిఓ రంగనాథరావు, స్థానిక ఎమ్మార్వో లక్ష్మణ్, ఆలయ సిబ్బంది సురేందర్, ఆలయ పూజారులు శ్రీనివాస్ శర్మ, మనీష్ శర్మ సిబ్బంది నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్లేస్కూల్స్‌గా అంగన్‌వాడీలు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ముస్తాపూర్ గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో అమ్మ మాట.. అంగన్వాడీ బాట కార్యక్రమంలో పిల్లలకు అక్షరభ్యాసం, అన్నప్రాసన, కార్యక్రమలు, నిర్వహించారు. అనంతరం తల్లులకు కూడా పలు జాగ్రత్తలు వివరిస్తు, పిల్లల మెదడు అభివృద్ధి అంశాలు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అంగన్వాడీ కేంద్రాలను ప్లే స్కూల్‌గా మారాయని సూపర్‌వైజర్ హారతి వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ అంజలి, ఆశ వర్కర్ సరూప, పిల్లలు, తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణమాఫీ

- రైతులు అధైర్యపడొద్దు

నవతెలంగాణ-రామారెడ్డి/మద్నూర్

అర్హులైన ప్రతి రైతుకు రూ 2 లక్షల వరకు రుణమాఫీ ప్రభుత్వం చేస్తుందని, సాంకేతిక కారణాల వల్ల కొందరి రైతుల పేర్లు వెల్లడించక పోయారని జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు అధైర్య పడవద్దని, సాంకేతిక సమస్యలను పరిష్కరించి ప్రభుత్వం రైతు రుణమాఫీ చేస్తుందని, ఎలాంటి సమస్యలు ఉన్న ప్రభుత్వం మండల, జిల్లా స్థాయిలో సందేహాలను నివృత్తి చేయడానికి కౌంటర్లను ఏర్పాటు చేశారని, అధికారులను సంప్రదించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వం మని పేర్కొన్నారు.

మద్నూర్‌లో 217 మంది రైతులకు రూ.87 లక్షల 12 వేలు మాఫీ

మద్నూర్ : మండల కేంద్రంలో గల సింగిల్ విండో పరిధిలో రుణాలు తీసుకున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతగా లక్షలోపు రుణ రైతులకు రుణమాఫీ చేశారణి విండో కార్యదర్శి బాబురావు అన్నారు. 217 మందికి రుణమాఫీ అయినట్టు వీరికి మొత్తం రూ.87లక్షల 12వేలు రుణమాఫీ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం జరిగిందని విండో కార్యాలయంలో నవతెలంగాణతో మాట్లాడుతూ శనివారం తెలిపారు. రుణమాఫీ రైతులకు గొప్ప వరమని కార్యదర్శి పేర్కొన్నారు.

ఏఈవోలను రెగ్యులరైజ్ చేయాలి

- ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-జుక్కల్

వ్యవసాయశాఖలో నాలుగేండ్లుగా విధులు నిర్వహిస్తున్న ఏఈవోలను రెగ్యులరైజ్ చేయాలని కోరుతు ఎమ్మెలే తోటలక్ష్మీకాంతారావ్‌కు ఏఈవోలు వినతి పత్రాన్ని శుక్రంవారం ఎమ్మెలే క్యాంపు కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా ఏఈవోలు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ శాఖ నందు అవుట్ సోర్సింగ్‌లో ఏఈవోలు సుమారుగా 450 మందికిపైగా పనిస్తున్నారని, 29-05-2020 నుంచి నేటివరకు నాలుగేండ్లుగా వ్యవసాయశాఖలోని వివిధ పనులను, రెగ్యులర్ ఏఈవోతో సమానంగా పని భారాన్ని మోస్తు సకాలంలో పనులన్నింటిని పూర్తీ చేస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా 40శాతం సాదారణ బదిలలో మాయొక్క వర్కింగ్ ప్లేస్‌ని ఖాళీగా చూపించడం వలన మా ఉద్యోగాలు కోల్పోతామని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. గత ప్రభూత్వం మా జీతాలను మధ్యవర్తి ద్వారా ఆరు లేదా ఎనమిది నెలలకు ఒకసారీ అందచేసేవారని, అదికూడా ప్రభూత్వం చెప్పినంత ఇవ్వకుండా జీతంలలో కోత విధించి ఒక్క జిల్లాలో ఒక్కొక్క విధంగా అందచేయడం జర్గుతుందని, అందువలన సమాన పనికి సమాన వేతనం అందించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఏఈవోలు

రేషన్ డీలర్‌ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లాలోని కామారెడ్డి డివిజన్ పరిధిలో గల భిక్కనూర్, దోమకొండ, కామారెడ్డి, పాల్వంచ, రాజంపేట, రామారెడ్డి, సదాశినగర్, తాడ్వాయి మండలాల్లోని గల చౌక ధరల దుకాణం డీలర్ల ఖాళీలు 31 ఉన్నాయని వాటిని భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ శనివారం విడుదల చేశారు.

భిక్కనూర్ మండలంలో బస్వాపూర్, భిక్కనూర్, బాగిర్తిపల్లి, కాచాపూర్, గురుజకుంట, దోమకొండ మండలంలో చింతమన్‌పల్లి, సంగమేశ్వర్, కామా రెడ్డి మండలంలో చిన్న మల్లారెడ్డిలో రెండు, కామారెడ్డి పట్టణంలో ఐదు రేషన్ దుకాణాలకు డీలర్లను భర్తీ చేయనున్నారు. పాల్వంచ మండలం లో పోతారం, ఎల్పికొండ, రాజంపేట మండలంలో రాజంపేటలో రెండు, శివాయిపల్లి, పొందుర్తి, తలమడ్ల, రామారెడ్డి మండలంలో ఇస్సన్నపల్లి, పోసానిపేట్, రాధాయిపల్లి, గన్‌పూర్, రెడ్డిపెట్, సదాశివనగర్ మండలంలో అడ్లూరు ఎల్లారెడ్డి, మరకల్, మోడిగాం, తుక్కోజివాడీ, తాడ్వాయి మండలంలో నందివాడ, ఎర్రపహాడ్, కన్కల్, గ్రామాలలో ఖాళీ ఉన్నాయని, వీటికి దరఖాస్తు దారుల కనీస విద్యాహర్వత పదవ తరగతి పాసై ఉండాలని ఆర్డీవో పేర్కొన్నారు. ఒకవేళ పదవ తరగతి కంటే ఎక్కువ విద్యార్హత ఉన్నా వారిని పదోతరగతి పాసైన వారితోసమానంగా చూడనున్న ట్టు తెలిపారు. దరఖాస్తుదారుల వయసు 18 సంవత్సరాల నుండి 40 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలన్నారు. దరఖాస్తు ఈనెల 20 నుండి 31 వరకు జిల్లా డివిజన్ అధికారి కార్యాలయం కామారెడ్డి లో దాఖలు చేసుకోవాలని అన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆగస్టు 9న రాత పరీక్షకు ఉదయం 11 గంటలకు నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామారెడ్డిలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆగస్టు 14 ఉదయం 10 గంటలకు డివిజన్ అధికారి కార్యాలయంలో ఒరిజినల్ పత్రాలతో హాజరు కావాలన్నారు. దరఖాస్తుదారులు 500 రూపాయలు చెల్లించి దరఖాస్తు ఫారం ను డివిజన్ అధికారి కార్యాలయం కామారెడ్డిలో పొందాలన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ముఖ్యపాత్ర

నవతెలంగాణ-గాంధారి

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ముఖ్యపాత్ర వహిస్తాయని సదశివనగర్ సీఐ సంతోష్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని హరాలే ఫంక్షన్‌హాల్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుపై ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో సీసీ సంతోష్‌కుమార్, ఎస్సై ఆంజనేయులు మాట్లాడుతూ.. పట్టణంలోని వ్యాపారస్తులు, ప్రజా ప్రతినిధులతో మీటింగ్ ఏర్పాటు చేసి, సీసీ కెమెరాలు యొక్క ప్రాముఖ్యత గురించి, ప్రతి ఒక్కరూ కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్, మాజీ ఎంపిటిసి సభ్యులు తూర్పు రాజులు, పిఏసిఎస్ చైర్మన్ సాయికుమార్, నాయకులు బెజుగం సంతోష్, ముస్తఫా, మల్లేష్, వ్యాపార సంస్థలు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జీపీని సందర్శించిన డీపీవో

నవతెలంగాణ-సదాశివనగర్



సిబ్బందితో మాట్లాడుతున్న డీపీవో

జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ సదాశివనగర్ గ్రామ పంచాయతీని శనివారం సందర్శించారు. ఈ సందర్భం గా మురికి కాలువలు తీయుట, బుష్ క్లియరెన్స్, కంపోస్ట్ షెడ్ ,దోమల మందు పిచికారి, ఆయిల్ బాల్స్ తయారీ,తదితర శానిటేషన్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి శ్రీనివాస్ , మండల పంచాయతీ అధికారి సురేందర్ రెడ్డి, మధు, పంచాయతీ కార్యదర్శి మాధవి లత తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నిజామాబాద్
4
ఆదివారం | జులై 21, 2024 | www.navatelangana.com

బ్రిలియంట్ హైస్కూల్‌లో 'బోనాలు'

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ


బోనాల పండుగలో పాల్గొన్న విద్యార్థులు

జిల్లా కేంద్రంలోని బ్రిలియంట్ హైస్కూల్‌లో బోనాల పండుగను శనివారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సాంప్రదాయంలో భాగమైన బోనాల పండుగను ఆషాఢమాసంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. అందులో భాగంగా బ్రిలియంట్ పాఠశాలలో విద్యార్థులచే బోనాల పండుగ సంబురాలను చేపట్టారు. పండుగ విశిష్టతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.రాజేంద్ర ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూనెపల్లిలో వన మహోత్సవం

- ఈత మొక్కలు నాటిన ఎక్సైజ్ శాఖ అధికారులు

నవతెలంగాణ-రెంజల్


మాట్లాడుతున్న ఎక్సైజ్ అధికారులు

మండలంలోని కూనేపల్లి చెరువు గట్టున వన మహోత్సవం పురస్కరించుకొని ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక గౌడ కులస్తులు మొక్కలను శనివారం నాటారు. చెరువు గట్టుకు ఇరుపక్కన మొక్కలు నాటినట్టు ఎక్సైజ్‌శాఖ ఎస్సై జలీల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ సిబ్బంది శ్రీవిద్య, సాగర్, స్థానిక గౌడ సంఘం నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రాజాగౌడ్, లింగంగౌడ్, సాయాగౌడ్, నారాగౌడ్, క్షేత్ర సహాయకుడు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ టీచర్లకు విద్యపై శిక్షణా తరగతులు


శిక్షణలో మాట్లాడుతున్న అధికారిణి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అంగన్వాడీ టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్యపైన నిజామాబాద్ అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలో శనివారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. గత నెల రోజుల నుంచి అంగన్వాడీ టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్య (ప్రీ స్కూల్)పైన శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఒక్కో బ్యాచ్‌కు 35 మంది అంగన్వాడీ టీచర్లకు చొప్పున మూడు రోజుల పాటు శిక్షణనిస్తున్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని మాస్టర్ ట్రైనర్స్ ద్వారా ఇప్పిస్తున్నారు. మెదడు అభివృద్ధి, తరగతి గది నిర్వహణ, ఆట, పాట, కథల ద్వారా విద్య అభ్యసన మూలలు, అభివృద్ధి క్షేత్రాలు, లక్ష్యాలు, పూర్వ గణిత భావనలు, పోర్ట్ పోలియో, ఈసీసీఈ డే, బాల మేలా, పూర్వ బాల్య ఆరంభ దశ, పూర్వ గణిత లిఖిత, పఠన నైపుణ్యాలు, జాతీయ నూతన విద్యవిధానంపైన, నిపుణ భారత్ మొదలైన అంశాలపైన శిక్షణ ఇవ్వనున్నట్టు వివరించారు.

నూతన భారతీయ చట్టాలపై అవగాహన


సన్మానించిన పలువురు

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జి.వైజయంతి ఆదేశాల మేరకు శనివారం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పి.లక్ష్మి నర్సయ్య నిజామాబాద్/కామారెడ్డి జిల్లాలోని కోర్టులో విధులు నిర్వహిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో భారతీయ న్యాయ సన్నిహిత-2023, భారతీయ సాక్ష అధినయం-2023, భారతీయ నాగరిక సురక్ష సన్నిహిత -2023 చట్టాల గురించి డిప్యూటి డైరెక్టర్ లక్ష్మీనర్సయ్య క్లుప్తంగా వివరించారు. ప్రతి పబ్లిక్ ప్రాసిక్యూటర్ తన విధులను శ్రద్ధతో నిర్వహించి, నూతన చట్టాలను అవలంబించి నేరస్తులకు శిక్షపడేటట్లు కృషి చేయాలని కోరారు. అదేవిధంగా బదిలీపై వచ్చిన యం.డి. రహిముద్దిన్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, నిజామాబాద్ జి.రామకృష్ణ, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, ప్రథమ శ్రేణి కోర్టు, ఆర్మూర్‌ను సత్కరించారు. ఈ సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ బంటు వసంత్, శ్యామావు, డా.సమ్మయ్య, ఖాందేష్ శ్రీనివాస్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు భూసారపు రాజేష్ గౌడ్, మహ్మద్ రహిముద్దిన్, అశోక్, శివరాంనాయక్, చిదిరాల రాణి, జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ ప్రత్యేకాధికారికి సన్మానం


ప్రత్యేకాధికారిని సన్మానిస్తున్న ఎంపీడీవో, గ్రామ అభివృద్ధి కమిటీ

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కూనేపల్లి జిల్లా పరిషత్ పాఠశాల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులతో పాటు, గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో హెచ్.శ్రీనివాస్‌ను గ్రామ అభివృద్ధి కమిటీ ఘనంగా శాలువా పూలమాలలతో సత్కరించారు. వారికి మెమొంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, నోడల్ అధికారి అంజనేయులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు నీరడి సాయిలు, శ్రీనివాస్ గౌడ్, మల్లేష్, లింగం, ఎంపీఓ గౌస్ ఉద్దీన్, గ్రామ కార్యదర్శి కృష్ణ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్మైల్స్ పాఠశాలలో రెయిన్ డే సంబురాలు



రెయిన్ డే సంబురాల్లో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని స్మైల్ ది పాఠశాలలో శనివారం రెయిన్ డే సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ రఫీ గౌహర్ మాట్లాడుతూ.. చిన్నారులు స్టాఫ్ మేనేజ్మెంట్ అందరూ రకరకాల రంగుల గొడుగులతో రెయిన్‌కోట్స్ ధరించి వర్షంలో వాటర్ గేమ్స్ హార్ట్ ప్రాజెక్ట్స్ రిలేటెడ్ రైన్ గేమ్స్ ఆడుతూ డాన్స్ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ షబానా గౌహర్, స్టాఫ్ సింధూర, సవిత, స్వప్న, సింధూజ, శ్రావణి, రోజ, సరిత, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను వినియోగించుకోండి


ఏర్గట్ల: చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న అంగన్వాడీ టీచర్లు


డిచ్‌పల్లిలో..


కమ్మర్‌పల్లిలో..

- పలు అంగన్వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాసాలు..

నవతెలంగాణ-విలేకరుల బృందం

అంగన్‌వాడీలను కేంద్రాలను వినియోగించుకోవాలని సంబంధిత అధికారులు సూచించారు. అమ్మ మాట అంగన్వాడీ బాట కార్యక్రమంలో భాగంగా శనివారం పలు అంగన్వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు.

ఏర్గట్ల : అమ్మ మాట అంగన్వాడీ బాట పేరిట మండలంలోని ఏర్గట్ల, తొర్తి, తాళ్ళరాంపూర్, గుమ్మిర్యాల్, తడపాకల్, బట్టాపూర్, దోంచంద, నాగేంద్రనగర్ గ్రామాల్లో గల అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిదండ్రుల సమక్షంలో శనివారం సామూహిక అక్షరాభ్యాసాలను అంగన్వాడీ టీచర్లు నిర్వహించారు. ఇందులో భాగంగా పూర్వ ప్రాథమిక విద్యపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ధర్మారంబీలో అమ్మమాట అంగన్వాడీ బాట..

డిచ్‌పల్లి : మండలంలోని ధర్మారం బి గ్రామంలోని కోడ్ నెంబర్ 78 అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అమ్మమాట-అంగన్వాడీ బాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిచ్‌పల్లి ప్రాజెక్ట్ సిడిపిఓ స్వర్ణ లత, డిచ్‌పల్లి 3వ సెక్టర్ సూపర్‌వైజర్ శ్రీప్రియ పాల్గొని పిల్లలకు సాముహిక అక్షరాభ్యాసం చేయించారు. ఇదే కాకుండా చిన్నారులు, తల్లులతో గ్రామంలోని పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ అదేశాల మేరకు అమ్మమాట అంగన్వాడీ బాట కార్యక్రమం విజయవంతంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి దానిని సంరక్షించే విధంగా చూడాలని పేర్కొన్నారు. చిన్నారి తల్లిదండ్రులకు అంగన్వాడి కేంద్రాల చదువులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ ఎడవెల్లి జ్యోతి సోమనాథ్, ఆయమ్మ, ఆశావర్కర్లు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం..

కమ్మర్‌పల్లి : మండలంలోని ఉప్లూర్ అంగన్వాడీ ఆధ్వర్యంలో అమ్మ మాట.. అంగన్వాడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు. తల్లుల సమక్షంలో సరస్వతి దేవి చిత్రపటానికి పూజలు నిర్వహించి చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్ సరిత మాట్లాడుతూ.. అంగన్వాడీలో ఎలాంటి ఒత్తిడి లేకుండా చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యాబోధన అందించనున్నట్టు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తున్నామని, అంగన్వాడి కేంద్రాలను చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 3 సంవత్సరాల నుంచి 5 సంవత్సరాలలోపు పిల్లలను తప్పకుండా అంగన్వాడి కేంద్రాలలో చేర్పాలని చిన్నారుల తల్లులకు సూచించారు. వారం రోజుల నుంచి విద్యార్థులకు నేర్పిన విద్య బోధనలు తల్లిదండ్రుల సమక్షంలో సమీక్షించారు. అనంతరం అక్షరాభ్యాసం చేయించిన చిన్నారులతో అక్షరాలను దిద్దించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సరిత, ఆయాలు పసుపుల లక్ష్మి, డాకూరి లక్ష్మి, తల్లులు, కిశోర బాలలు, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నియంత్రణలో ఎక్సైజ్ అధికారులు విఫలం

- సీపీఐ ఆధ్వర్యంలో ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



ధర్నా చేస్తున్న సిపిఐ నాయకులు

ప్రభుత్వం డ్రగ్స్‌ను నియంత్రించాలని ఆదేశాలు జారీచేస్తున్నా.. ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్లు ఉండటమేమిటని సిపిఐ ప్రశ్నించింది. నిజామాబాద్ ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం ముందు సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా చేసి ఎక్సైజ్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలను అరికట్టాలని సంకల్పంతో పనిచేస్తున్నదని, కానీ నిజామాబాద్ నగరంలో ఉన్న 3 కల్లు డిపోల్లో గీతకార్మికులను సిట్టింగ్ జీతం పేరుతో పక్కనపెట్టి చెట్లనుండి కల్లు తీయకుండా కేవలం నీళ్లలో ఆల్ప్రాజోలం, ఇతర మత్తు పదార్థాలను కలిపి కల్తీకల్లు తయారు చేస్తున్న ఘనత కల్లు కాంట్రాక్టర్లదేనని అన్నారు. ఎక్సైజ్ నిబంధనల ప్రకారం ఏ కల్లు డిపోకు ఎక్కడ ఈత, తాటి, ఖర్జూర వనం కేటాయించారో ప్రజలకు తెలియపరచాల్సిన అవసరం సంబంధిత ఎక్సైజ్ అధికారులపై ఉన్నదని అన్నారు. నిజామాబాద్ నగరంలో ఎక్సైజ్ ఈఎస్, సిఐ, ఎస్సై, ఇతర సిబ్బంది ఉన్నప్పటికీ నీటిలో ఆల్ప్రాజోలం, ఇతర ప్రమాదకరమైన మత్తు పదార్థాలను కలిపి కల్లుప్రియులకు అలవాటు చేసి కల్తీ కల్లుకు బానిసలుగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ స్పందించి కల్లు డిపోలలో తనిఖీలు చేసి కల్లును కల్తీ చేస్తున్న కాంట్రాక్టర్లను వెంటనే అరెస్టు చేసి కల్తీ కల్లును తయారు చేస్తున్న డిపోలను, విక్రయిస్తున్న కల్లు దుకాణాలను సీజ్ చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని ఎక్సైజ్ అధికారులను డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు వై.ఓమయ్య, పి.నర్సింగ్‌రావు, బి.రఘురాం, సక్కి సురేష్, కె.గంగాధర్, అమర్, భాను, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి

నవతెలంగాణ-నిజామబాద్ సిటీ

వినియోగదారులకు మరింత చేరువయ్యి వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించే దిశగా వారి ఫిర్యాదులను తీసుకొని వాటిని సకాలంలో పరిష్కరించేందుకు ప్రతి సోమవారం 'విద్యుత్ ప్రజావాణి' నిర్వహించనున్నట్టు సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆర్.రవీందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారం కొరకు టీజీ ఎన్పీడీసీఎల్ సర్కిల్ పరిధిలోని అన్ని ముఖ్య కార్యాలయాలైన సర్కిల్ ఆఫీస్, డివిజన్ ఆఫీస్, ఈఆర్వో, సబ్ డివిజన్ ఆఫీస్, సెక్షన్ ఆఫీస్‌లలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డివిజన్ ఆఫీస్, ఈఆర్వో, సబ్ డివిజన్ ఆఫీస్, సెక్షన్ ఆఫీస్‌లలో "ప్రతి సోమవారం" ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు, సర్కిల్ ఆఫీస్‌లో అదే రోజు సమయం మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫిర్యాదులు చేయవచ్చని పేర్కొన్నారు. విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగదారుల సేవే లక్ష్యంగా, వారి ఫిర్యాదుల సత్వర పరిష్కారం చూపే విధంగా 'విద్యుత్ ప్రజావాణి'ని సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తీర్చిదిద్దారని తెలిపారు.

డైనింగ్ హాల్ ఏర్పాటుకు కృషి చేస్తా

నవతెలంగాణ-నందిపేట్


పరిశీలిస్తున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు

మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలను, మధ్యాహ్న భోజనాన్ని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు మంద మహిపాల్ శనివారం పరిశీలించారు. గతంలో తమ కాంగ్రెస్ ప్రభుత్వంలో మోడల్ స్కూల్ నిర్మాణం కోసం అప్పటి మంత్రి సుదర్శన్‌రెడ్డి ప్రోత్సాహంతో నిర్మాణం చేపట్టారన్నారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. పాఠశాలలో కనీస వసతులు, సమస్యలు విద్యార్థులను ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం సమయంలో కూర్చోవడానికి ఇబ్బందులకు గురవుతున్నట్లు విద్యార్థులు తెలిపారు. విద్యార్థుల కోసం డైనింగ్ హాల్ నిర్మాణం కోసం, అలాగే విద్యార్థులకు తాగేందుకు నీటి సౌకర్యం కోసం ఆర్మూర్ నియోజకవర్గ ఇన్చార్జి వినయ్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని మంద మహిపాల్ తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ అధ్యక్షులు ఇషబ్, ఖదీర్, నిఖిల్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

- తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి


మాట్లాడుతున్న చైర్మన్ ఈరవత్రి అనిల్

పద్మశాలి విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పద్మశాలి విజయ సంఘ భవనంలో మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పద్మశాలి విద్యార్థులకు ప్రతిభా పురస్కాల ప్రదానం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పద్మశాలి ముద్దుబిడ్డలు అన్ని రంగాల్లో పైకి ఎదగాలన్నారు. బాగా చదవడం ద్వారా పద్మశాలి విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకుని భవిష్యత్తులో స్థిరపడాలన్నారు. ప్రస్తుత విద్యార్థులు సాధించిన విజయాలు భవిష్యత్తు తరాల విద్యార్థులకు ఆదర్శంగా, స్ఫూర్తిగా నిలవాలన్నారు. విద్యార్థులు ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళితే అందుకు ప్రభుత్వం కూడా ప్రోత్సాహం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ అశోక్ విద్యార్థులకు చదువులో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ఎలా ముందుకెళ్లాలనే అంశంపై అవగాహన కల్పించారు. అనంతరం పదవ తరగతి, ఇంటర్, పాలిటెక్నిక్, ఎంసెట్, బిటెక్ ఇతరత్రా చదువుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని విద్యార్థులను మెమొంటోలతో సత్కరించారు. అంతకుముందు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులై మొదటిసారి పద్మశాలి విద్యార్థుల ప్రతిభ పురస్కార కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన ఈరవత్రి అనిల్‌ను పద్మశాలి సంఘం మండల సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు బీజు దత్తాద్రి, గౌరవ అధ్యక్షులు పుల్గం హనుమండ్లు, పద్మశాలి సంఘం జిల్లా సభ్యులు, పద్మశాలి సంఘం మండల సభ్యులు, మండలంలోని ఆయా గ్రామాల పద్మశాలి సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

డిపో నూతన మేనేజర్‌కు సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

టిఎస్ ఆర్‌టిసి డిపో ఎంప్లాయిస్ యూనియన్ డిపో కమిటీ ఆధ్వర్యంలో శనివారం నూతనంగా వచ్చిన డిపో మేనేజర్ రవికుమార్‌ను కలిసి సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు రవిచందర్, రమేష్, రాష్ట్ర కార్యదర్శులు గోపి, డిసి లతా, డిప్యూటీ ఎస్ పిడి జనార్ధన్, టిఐ3 నారాయణ, ఏడిసిలు గంగాధర్, శ్రీనివాస్, గణేష్, లింబాద్రి, భూమన్న, శ్రీనివాస్, గోవర్ధన్, చక్రధర్, త్రివేణి, సుమలత, సుజాత, కొలిపాక సుజాత తదితరులు పాల్గొన్నారు.

దాశరథి కృష్ణమాచార్యుల 99వ జయంతి వేడుకలు


చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పలువురు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సరస్వతీనగర్ రోడ్ నెంబర్ 4 శబ్ద తరంగిణి సంస్థ కార్యాలయంలో దాశరథి కృష్ణమాచార్యుల జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆర్అండ్‌బీ ప్రకాష్ గౌడ్ హాజరై మాట్లాడుతూ.. నా తెలంగాణ కోటి రతనాల వీణ అని దాశరథి కృష్ణమాచార్యులు అన్నారని తెలిపారు. ఈ సమావేశానికి అధ్యక్షులుగా రిటైర్డ్ ఆచార్యులు జిజి కళాశాల సెర్ల దయానంద్ హాజరై మాట్లాడుతూ.. నిజామాబాద్‌లోని ఖిల్లా జైలు గోడల మీద ఎన్నో పద్యాలు రాశారని, చావు ఎదుట ఉండగా బొగ్గుతో ఎంతో విషయాలు రాసారని వివరించారు. ఆయన చైతన్య సారధి, పాటల వారధి ఆయనే దాశరథి అని తెలియజేశారు. ఆ చల్లని సముద్ర గర్భం దాచిన బడా బానల మెంతో అనే కవితలు రాసిన మహాయోధుడు అని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా రిటైర్డ్ ఆర్అండ్‌బీ సూపరింటెండెంట్ వినోద్ కుమార్, రాపల్లి శ్రీనివాస్, శ్రావణ్ కుమార్, సురేష్, ప్రవీణ్ కుమార్, రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలను విస్తరిస్తాం

- లయన్స్ క్లబ్ గవర్నర్ లక్ష్మీ


మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-ముప్కాల్

లయన్స్ క్లబ్ సేవలను విస్తరిస్తామని లయన్స్ క్లబ్ గవర్నర్ లక్ష్మీ అన్నారు. ముప్కాల్ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం మహోత్సవాన్ని శుక్రవారం రాత్రి మండల కేంద్రంలోని జీఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా లయన్స్ క్లబ్ గవర్నర్ లక్ష్మీ హాజరై ముప్కాల్ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో రూ.2 కోట్ల రూపాయలతో కంటి ఆసుపత్రిని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రజలకు అందుబాటులో రూ.9కోట్ల రూపాయలతో పెద్దాసుపత్రిని ఈ నెల 25న ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాలను ఆయా జిల్లాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. లయన్స్ క్లబ్ నిరుపేద కుటుంబాలను ఆదుకోవడంలో ముందుంటుందని అన్నారు. లయన్స్ క్లబ్ సేవలను రాష్ట్రమంతటా విస్తృత స్థాయిలో ప్రజలకు తెలియపరుస్తామన్నారు. అదేవిధంగా బాల్కొండ, మెండోరా మండలాల నూతన కార్యవర్గ సభ్యులచే సైతం ఈ కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా సభ్యులు జ్ఞానసాగర్ రెడ్డి, అమర్‌నాథ్, పోతూ ప్రసాద్, వెంకటగిరి, చాకు లింగం, దినేష్ పటేల్, జీవన్‌రెడ్డి, ముస్కు రాజేశ్వర్, కిషన్, సిద్ధ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో మూడో తరగతి వరకు సమంజసం కాదు

- ప్రాథమిక పాఠశాలల్లోనే పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించాలి
- టీఎస్ యూటీఎఫ్

నవతెలంగాణ-భీంగల్

అంగన్‌వాడీలను ప్లేస్కూల్స్‌గా మార్చి మూడవతరగతి వరకు నిర్వహించాలనే ప్రభుత్వ ప్రతిపాదన సరైంది కాదని, దానిని వెంటనే విరమించుకోవాలని టిఎస్‌యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మల్కా జనార్ధన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అంగన్‌వాడీలను పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా తల్లిదండ్రులు గుర్తించటం లేదని, కనుక 1,2,3 తరగతులను అంగన్‌వాడీలకు అప్పగించటం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల మూసివేతకే దోహదపడుతుందని టిఎస్ యుటిఎఫ్ అభిప్రాయపడుతున్నదని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోనే పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించాలని కోరారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్‌గా మార్చాలనే ప్రతిపాదన ఆహ్వానించతగినదని, ఎంపిక చేసిన పాఠశాలల్లో తరగతికొక టీచరు, సబ్జక్టుకొక టీచరు, ప్రధానోపాధ్యాయులు, తగినంత బోధనేతర సిబ్బంది పాఠశాలలో ఉండేలా చూడాలని టిఎస్ యుటిఎఫ్ సూచించిందని ఆయన తెలిపారు.

విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు యం.గంగారాం పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం శనివారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థుల క్రమశిక్షణలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల పాత్ర కీలకమని ప్రస్తావించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులు సహకరించాలని ప్రధానోపాధ్యాయులు కోరారు. విద్యార్థులు దురలవాట్లకు, చెడువ్యసనాలకు దూరంగా ఉండే విధంగా తల్లిదండ్రులు తమ పిల్లల్ని గమనించాలన్నారు. గత రెండు నెలలుగా అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా పాఠశాలలో చేపట్టిన మరమ్మతులను విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యక్షంగా చూపించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై జాగ్రత్తలు పాటించాలి

- గ్రామపంచాయతీ కార్యదర్శి రామిరెడ్డి

నవతెలంగాణ-ఎడపల్లి

వర్షాకాలం దృష్ట్యా గ్రామీణ ప్రాంత ప్రజలు తమ ఇంటి పరిసర ప్రాంతాలతో పాటు ఇంట్లో పరిసరాలను వంట పాత్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామపంచాయతీ కార్యదర్శి రామిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మంగళ్‌పహాడ్ గ్రామపంచాయతీ ఇబ్బంది ఇటీవల గ్రామంలో మురికి కాలువలు శుభ్రం చేసి, చెత్తాచెదారాన్ని డంపింగ్‌యార్డ్‌కు తరలించారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు గ్రామంలో ఉన్న రెండువాటర్ ట్యాంకులను బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేయిస్తున్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్నదే తమ లక్ష్యమంటున్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ బిల్ కలెక్టర్ పద్మావతి, వాటర్‌మ్యాన్ కుంట సంతోష్, జీపి ట్రాక్టర్ డ్రైవర్ శ్రీనివాస్, పారిశుధ్య కార్మికులు, స్థానికులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ కృషి

- మంత్రి జూపల్లి కృష్ణరావు

నవతెలంగాణ-దోమకొండ/భిక్కనూర్

ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం రైతులకు ఏక కాలం లో రుణమాఫీ చేసి వారిని ఆదుకుంటూన్నామని మంత్రి జూపల్లి కృష్ణరావు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ అన్నారు. దోమకొండ, భిక్కనూర్ మండల కేంద్రాల్లో రైతు రుణమాఫీ సంబరాలు శనివారం నిర్వహించారు. దీంట్లో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి చిత్ర పాటలకు పాలాభిషేకం చేసి, రైతు వేదిక వరకు వేలాది మంది రైతులతో ర్యాలీగా బయలుదేరి సంబురాలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు సంక్షేమనికి ప్రభుత్వం కృషి చేస్తుందని, రైతు రుణమాఫీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచిందరన్నారు. రాహల్ గాంధీ రైతు డిక్లరేషన్‌లో భాగంగా రైతులకు రెండు లక్షల రుణమాఫీ పథకంను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసింద న్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమనికి త్వరలో అనేక పథకాలు అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అనం త రెడ్డి, మాజీ జడ్పీటీసీ తీర్మల్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్రబో యినస్వామి, రామ స్వామి గౌడ్, నర్సరెడ్డి, నర్సయ్య, ముత్యం రెడ్డి, మధు, మాజీ ఎంపీటీసీ నల్లపు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ-బిచ్కుంద

సోదరి ఇంటికి వచ్చిన వ్యక్తి బయటకు వెళ్లి అదృశ్యమైన ఘటన బిచ్కుంద మండలంలోని ఖత్గాం గ్రామంలో చోటుచేసుకున్నట్టు ఎస్ఐ మోహన్‌రెడ్డి శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బాన్సువాడకు చెందిన గాండ్ల సాయిలు ఈనెల 5వ తేదీన ఖత్గాం గ్రామంలో ఉంటున్న తన సోదరి ఇంటికి రాగా పదవ తేదీన బయటికి వెళ్లి వస్తానని చెప్పి ఇంట్లోంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బంధువుల వద్ద వాకాబు చేసిన ఆచూకీ లభించకపోవడంతో తల్లి గాండ్ల అంజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యుత్ వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు విద్యుత్ వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలని మండల విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గ్రామాలలో, వ్యవసాయ పొలాల మధ్య ఉన్న కరెంట్ స్తంభాలు, తడిగా ఉన్న ఇంటి గోడలు, మోటారు స్టార్టర్లు, తెగిపడిన విద్యుత్తు తీగలు, సర్వీస్ వైర్లు ఎవరు కూడా తడిగా ఉన్నప్పుడు తాకవద్దని సూచించారు. అలాగే ఏదైనా సమస్య ఉన్నప్పుడు సంబంధిత అధికారులు, సిబ్బందికి సమాచారం ఇవ్వాలని లేదా దగ్గరలో ఉన్న విద్యుత్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని తెలియజేశారు.

రాష్ట్రస్థాయిలో ఉత్తమ రక్తదాతలకు పురస్కారాలు అందజేత

నవతెలంగాణ-కామారెడ్డి

రక్తదానం చేస్తున్న వారి సేవలను గుర్తించి వారికి రాష్ట్ర స్థాయి పురస్కారాలను హైదరాబాదులోని ముషీరాబాద్ లో గల వైశ్యభవన్ లో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఐవిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉప్పల శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో 73 మంది రక్తదాతలకు తెలంగాణ రాష్ట్ర ఉత్తమ రక్తదాతల పురస్కారాలు-2024ను రాజ్యసభ సభ్యులు,అనిల్ కుమార్ యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఐవిఎఫ్ సెంట్రల్ కమిటీ బోర్డు అడ్వైజరీ బోర్డు చైర్మన్ గంజి రాజమౌళి గుప్తాల ఆధ్వర్యంలో ప్రశంస పత్రాన్ని, మెమెంటోతో సన్మానించారు. ఐవిఎఫ్, కామారెడ్డి రక్తదాతల సమూహం ఆధ్వర్యంలో సంవత్సర కాలంలో తలసేమియా చిన్నారుల కోసం 2306 యూనిట్ల రక్తాన్ని సేకరించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డు నమోదు కావడానికి కృషి చేసిన డాక్టర్ బాలు వారి బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి రక్తదాతల సమూహ సన్మాన గ్రహీతలు డాక్టర్ పుట్ల అనిల్, జమీల్, హైమద్ గంప ప్రసాద్, ఎర్రం చంద్రశేఖర్, శ్రీకాంత్ రెడ్డి, కిరణ్, సాయి,రమణ తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానం చేసిన కుటుంబానికి ప్రశంసా పత్రం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో కొద్దిరోజుల క్రితం గ్రామానికి చెందిన ప్రవీణ్‌రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో బ్రెయిన్‌డెడ్ అయి మరణించాడు. కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు ప్రవీణ్ అవయవాలు దానం చేసిన విషయం తెలిసిందే. శనివారం జీవందన్ బృందం సభ్యులు ప్రవీణ్ కుటుంబ సభ్యులకు ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నుంచి ఒక సస్పెండ్

నవతెలంగాణ-లింగంపేట్

పార్టీ గౌరవాన్ని భంగపరిచినందుకు కాంగ్రెస్ పార్టీ నుండి ఒకరిని సస్పెండ్ చేసినట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బుర్ర నారా గౌడ్ తెలిపారు. శనివారం లింగంపేట్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాలవత్ తండా ప్రకాష్ నాయక్ కాంగ్రెస్ పార్టీని అగౌరపరుస్తూ పార్టీకి భంగం కల్పిస్తూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టడంతో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్టు తెలిపారు. పార్టీ నియమ నిబంధనలకు కట్టుబడి ఉండాలని పార్టీ వ్యతిరేకంగా పనిచేసినా, పార్టీని అగౌరపరిచినా, అవమానపరిచినా ఉపేక్షించేది లేదన్నారు. అందరూ పార్టీ నిబంధనలకు కట్టుబడి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లింగంపేట్ టౌన్ అధ్యక్షులు ప్రసాద్ గౌడ్, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ నగేష్, మండల యూత్ ఉపాధ్యక్షులు రామగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

నవతెలంగాణ-నవీపేట్

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ ప్రవేట్ పాఠశాలలతో పోటీపడాలని సూచించారు. పాఠశాలల్లో మౌలిక వసతులపై ప్రధానోపాధ్యాయులతో చర్చించారు. అనంతరం కళ్యాణలక్ష్మి 82 చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ చెప్పిన ప్రకారం ఆగస్టు 15లోపు రుణమాఫీ చేసిందని అన్నారు. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ప్రభుత్వ పథకాలను వినియోగించుకొని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఐకెపి కమ్యూనిటీ కోఆర్డినేటర్ రవి అన్నారు. శనివారం మండలంలోని తొర్లికొండ గ్రామంలోని సూర్య గ్రామ సంఘం సమావేశాన్ని నిర్వహించారు. జనరల్ బాడీ సమావేశంలో 2023-24 సంవత్సరానికి గానూ ఆర్థిక లావాదేవీలను కార్యదర్శి చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఐకెపి కమ్యూనిటీ కోఆర్డినేటర్ రవి మాట్లాడుతూ.. మహిళా శక్తి కార్యక్రమాలను వినియోగించుకొని ప్రతి ఒక్కరూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ప్రతి ఒక్కరూ పాడి గేదెలను కొనుగోలు చేసి పాల ఉత్పత్తిని పెంచి దేశ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. అదేవిధంగా నాటు కోళ్ల పెంపకాన్ని చేపట్టి ప్రతి ఒక్కరూ ఆదాయాన్ని సమకూర్చుకోవాలన్నారు. ఫుడ్ ప్రాసెస్ యూనిట్లకు మండల సమైక్య నుంచి తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తున్నట్టు తెలిపారు. స్కూల్ పిల్లల యూనిఫామ్ కుట్టడానికి టైలర్ ఉన్న ప్రతి మహిళ ముందుకు వచ్చి ప్రభుత్వం ఇచ్చే ప్రతి పథకాన్ని వినియోగించుకొని అన్ని విధాలుగా ఆర్థికంగా ఎదగాలన్నారు. అదేవిధంగా ఆహార శుద్ధి యంత్రాలను కొనుగోలు చేసి రైస్ మిల్లులను, నూనె మిళ్లను, పిండి గిర్నీలను, గానుగ మిషిన్లను ఏర్పాటు చేసుకొని కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే సబ్సిడీని వినియోగించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంఘం ప్రతినిధులు, అన్ని గ్రామ సంఘాల సభ్యులు వివోఏలు తదితరులు పాల్గొన్నారు.

రైతు బీమా పథకానికి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

రైతు బీమా పథకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నాగిరెడ్డిపేట్ మండల వ్యవసాయ అధికారి విజయ శేఖర్ శనివారం తెలిపారు. కొత్తగా పట్టాదారు పుస్తకం పొంది ధరణిలో రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకొని ఆర్ఎఓఎస్ఆర్ పట్టాలు పొందిన 18 నుంచి 59 ఏళ్ల వయసు ఉన్న రైతులు రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రైతు పట్టా పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, జిరాక్స్ నామిని ఆధార్ కార్డు జిరాక్స్ రైతు బీమా దరఖాస్తు ఫారం దరఖాస్తులను రైతు స్వయంగా వెళ్లి సంబంధిత ఆగస్టు 15వ తేదీలోగా అందజేయాలని సూచించారు. ఇంతకుముందు నమోదు చేసుకున్న రైతులు ఎవరైనా సవరణలు ఉంటే సరి చేసుకోవాలని ప్రమాదవశాత్తు నామిని చనిపోయినా కొత్త నామిని మార్పు కోసం వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు. పట్టాదారు పుస్తకం ఉండి ఇంతకుముందు నమోదు చేసుకొని రైతులు కూడా పూర్తి వివరాలతో సంబంధిత ఈవోను సంప్రదించాలని మండల వ్యవసాయ అధికారి విజయ శేఖర్ తెలిపారు.

ప్రభుత్వ స్కూల్‌లో సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నగరంలోని హమాల్‌వాడిలోని దారుగల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. శనివారం హమాల్‌వాడి దారుగల్లి ప్రభుత్వ హైస్కూల్‌లో పిడిఎస్‌యూ ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వర్షాకాలం వచ్చిందంటే స్కూల్ ప్రాంగణంలో వర్షపు నీరు చేరి డ్రైయినేజీకి వెళ్ళే దారిలేక అక్కడే నీళ్లు నిల్వ ఉంటున్నాయని అన్నారు. విద్యార్థులు క్లాస్ రూమ్స్‌లోకి వెళ్ళాలన్నా.. బయటకు రావాలన్నా నీటిలో నుంచి నడవాల్సిందేనని వివరించారు. 100కి పైగా ఉన్న విద్యార్థులకు 2 బాత్రూమ్‌లు మాత్రమే ఉన్నాయని అన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పి.డి.ఎస్.యూ నాయకులు మనోజ్, భరత్, అనిల్, రామ్ తదితరులు పాల్గొన్నారు.

ఖాజాపూర్‌లో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-బోధన్

సాలూరా మండలంలోని ఖాజాపూర్ గ్రామంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి రైతులు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో అశోక్, చిద్రపు రాములు, లక్ష్మన్న, దాసరి బాబు, గంగారం, మోహన్, డిష్ రమేష్, లచ్చారాం, మారుతి పటేల్, శేషారావు, సాయిలు, శివరాజ్ పటేల్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్‌ఫోర్స్ పాఠశాలలో బోనాల ఉత్సవాలు

నవతెలంగాణ-ఆర్మూర్



పట్టణంలోని ఆల్‌ఫోర్స్ పాఠశాలలో శనివారం బోనాల ఉత్సవాలను సంబురంగా నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థుల వేషధారణ చూపర్లను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆల్‌ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మన సాంస్కృతి సాంప్రదాయాలకు ఈ ఉత్సవాలు ఎంతో ప్రాముఖ్యమైనవని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

ఇష్టరీతినా ఫీజులు వసూలు చేస్తున్న

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలో, మండలంలోని ప్రైవేట్ పాఠశాలలు ఇష్టరీతినా ఫీజులు వసూలు చేయడమే కాకుండా పుస్తకాల పేరుతో అత్యధికంగా డబ్బులు వసూలు చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ప్రసాద్, బోధన్ డివిజన్ నాయకులు విగ్నేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయ సిబ్బంది మానసకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిరుపతయ్య కమిషన్ ఆదేశాల మేరకు ప్రైవేటు పాఠశాలలు నిబంధనలు పట్టించుకోవడంలేదని అన్నారు. అలాగే జీవో నెంబర్ 01, 42, 91 ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు విక్రయించడం, పాఠశాలలో స్కూల్ యూనిఫామ్స్, టై, బెల్ట్స్ అమ్మొద్దని నిబంధనలు చెబుతున్నా, కార్పొరేట్ పాఠశాలలు పట్టించుకోవడంలేదని వాటిపైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలు స్కూల్ ఫీజులు పెంచాలంటే పేరెంట్స్ కమిటీతో చర్చించి పెంచాలని, కానీ నిబంధనను ఉల్లంఘించి ఇష్టాను సారంగా ఫీజులు పెంచడం దారుణ మన్నారు. పాఠశాలల్లో ఫీజుల స్ట్రక్చర్ బోర్డుని వెంటనే ఏర్పాటు చేసే విధంగా జీవో ఇవ్వాలని తెలిపారు. లేకపోతే భవిష్యత్తులో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రఘు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అర్హులైన ప్రతిరైతుకూ రుణమాఫీ

- నిజామాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్

నవతెలంగాణ-ఎడపల్లి

భూమి ఉన్న ప్రతి రైతుకూ రుణమాఫీ చేస్తామని నిజామాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులతో ఆయన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. రుణమాఫీ పంపిణీ కార్యక్రమంపై చర్చించారు. రైతులు నిరుత్సాహ పడకుండా ఉండాలన్నారు. ప్రతి రైతుకూ రుణమాఫీ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అనంతరం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి (ఏడిఏ) రైతుల ఇంటికి వెళ్లి రుణమాఫీ అయిందా లేదా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎడపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి సిద్ధరామేశ్వరరావు, వ్యవసాయ శాఖ విస్తీర్ణ అధికారిని జ్యోతి, రైతులు జొగ్గరి మోహన్, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు జగ్గయ్య సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్న ఏడీఏ

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- తెలంగాణ బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ముత్తన్న
- బీడీ కార్మికుల ర్యాలీ

నవతెలంగాణ-ఆర్మూర్

బీడీ కార్మికుల జీవన భృతి పెంచాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీని ప్రభుత్వం నెరవేర్చాలని తెలంగాణ బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ముత్తన్న అన్నారు. శనివారం తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బీడీ కార్మికులకు రూ.4016 జీవనభృతి పెంచాలని, పట్టణం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పట్టణంలోని వివిధ వార్డులు మామిడిపల్లి, పెర్కిట్, ప్రాంతాలలో బీడీలు చుట్టే కార్మికులు, ప్యాకింగ్ కార్మికులు, చాటన్ కార్మికులు, బట్టి వాళ, వాచ్మెన్లు, ఆఫీస్ వర్కర్లు, ఇతరులు అనేక సంవత్సరాలుగా బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. గత కొంతకాలంగా వాళ్ల పరిస్థితి అయోమయంగా మారిందని వివరించారు. వారానికి రెండు లేదా నెలకు వారం రోజుల కంటే ఎక్కువ పని దొరకడం లేదని అన్నారు. వారికి వారి కుటుంబానికి జీవనోపాధి కొనసాగించడానికి అనేక రకాలుగా ఆర్థికంగా, మానసికంగా, ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. ప్రభుత్వం స్పందించి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టియు నాయకులు అరవింద్, తూర్పాటి శ్రీనివాస్, నజీర్, పద్మ సునీత, లక్ష్మి మమత, బీడీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

బెహరాన్‌లో మెండోరా వాసి మృతి

- కోటపాటిని ఆశ్రయించిన కుటుంబ సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

మెండోరా మండల కేంద్ర వాసి మాకూరి వినోద్ (32) ఉపాధి కోసం ఆజాద్ వీసాపై మూడు సంవత్సరాలుగా బెహరన్ దేశంలో పనిచేస్తున్నాడు. రెండు రోజుల క్రితం "అక్కడి షేక్ ఇసాబిన్ సల్మాన్ హైవే పక్కన కేబ్ కోసం తవ్విన గుంతలో ప్రమాదవశాత్తు పడిపోవడంతో ప్రాణాలు కోల్పోయాడు. విషయం తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు ప్రవాస భారతీయులు హక్కులు సంక్షేమ వేదిక అధ్యక్షులు కోటపాటి నరసింహానాయుడును శనివారం కలిశారు. మృతదేహాన్ని ఉచితంగా తొందరగా ఇంటికి చేర్చవలసిందిగా వినతిపత్రం అందజేశారు. దీంతో ఆయన త్వరలోనే మృతదేహాన్ని పంపించడానికి చర్యలు చేపట్టారు. అదేవిధంగా బెహరన్‌లోని తెలుగు తెలంగాణ వాసుల నుంచి సహాయం అదేవిధంగా తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. కోటపాటిని కలిసిన వారిలో బాధిత కుటుంబ సభ్యులు ఉన్నారు.

ఆర్టిస్టుల సంక్షేమానికి బడ్జెట్లో వేయి కోట్లు కేటాయించాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఆర్టిస్టుల సంక్షేమానికి బడ్జెట్లో 1000 కోట్లు కేటాయించాలని రాష్ట్ర అధ్యక్షులు తాళ్ళపెల్లి రాజేశ్వర్ డిమాండ్ చేశారు. శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పద్మనగర్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. తెలంగాణ ఆర్టిస్టుల సంక్షేమ సమితి జిల్లాస్థాయి సమావేశాన్ని చేపట్టారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు తాళ్ళ పెల్లి రాజేశ్వర్ హజరై మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్టిస్టుల సంక్షేమానికి బడ్జెట్లో 1000 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామకృష్ణ, బాలకృష్ణ మాడిశెట్టి, మైదా మల్లేష్, మహదేవ్, కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌లో ఘనంగా ఊర పండుగ

నవతెలంగాణ-బోధన్



ప్రతి సంవత్సరం ఆషాడ మాసంలో నిర్వహించే ఊర పండగను శనివారం బోధన్ పట్టణంలో ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం అర్ధరాత్రి బోధన్ పట్టణంలోని నడి హనుమాన్ ప్రాంతంలో ప్రారంభమైన ఊర పండుగ శనివారం మధ్యాహ్నం వరకు కొనసాగింది. భక్తులు గ్రామ దేవతలను పట్టణంలోని ప్రధాన వీధుల గుండా డప్పు చప్పుళ్లతో పోతురాజుల విన్యాసాలు గ్రామ దేవతలను ఊరేగించి ప్రతిష్ఠించారు. పోతురాజుల విన్యాసాలు పట్టణ వాసులను అలరించాయి. గ్రామ దేవతలను దర్శించుకోవడానికి భక్తులు భారీగా తరలి రావడంతో పట్టణం రద్దీగా మారింది. పండుగ సందర్భంగా పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏసిపి శ్రీనివాస్ తన పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు భాగరెడ్డి పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

బ్యాంకు మేనేజర్‌కు సన్మానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని పడకల్ గ్రామంలో మహిళా గ్రామ సంఘం జనరల్ బాడీ సమావేశం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో పడకల్ ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ శాలువాతో ఘనంగా సన్మానించి గిఫ్టను అందజేశారు. 2023-24 విద్యాసంవత్సరానికి గానూ ఆర్థిక లావాదేవీలను కార్యదర్శి చదివి వినిపించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ కోఆర్డినేటర్ దశరథ్ మాట్లాడుతూ.. మహిళా శక్తి కార్యక్రమాలు వినియోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం ఎస్బిఐ బ్యాంక్ మేనేజర్‌ను సన్మానించి పడకల్ గ్రామానికి మహిళా సంఘాల రుణాలు ఇచ్చినందుకుగానూ సంతోషం వ్యక్తం చేసి బ్యాంక్ మేనేజర్‌కు గిఫ్టును అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంఘం ప్రతినిధులు, గ్రామంలోని అన్ని సంఘాల సభ్యులు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

పలకలు పంపిణీ

నవతెలంగాణ-బోధన్

మండలంలోని ఊట్పల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రాలలో శనివారం చిన్నారులకు అక్షరాభ్యాసం సందర్భంగా మాజీ సర్పంచ్ కుమారుడు సుమన్ గుప్త ఆధ్వర్యంలో చిన్నారులకు పలకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాలలో చదువుకోవడానికి వచ్చే విద్యార్థులకు తన వంతు సేవా కార్యక్రమాలలో భాగంగా అక్షరాభ్యాసం నిర్వహించి వారికి పలకలను పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు జయసుధ గ్రామస్తులు పాల్గొన్నారు.

సోయాబిన్ పంటను పరిశీలించిన ఏఓ

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని తిమ్మాజివాడి గ్రామంలో శనివారం మోతిరాం రైతు సోయబిన్ పంటను మండల వ్యవసాయ అధికారి ప్రజాపతి పరిశీలించారు. సోయబిన్ పంటకు వచ్చిన చీడపీడల నివారణకు రైతుకు సూచనలు, పిచికారీ చెసే మందులను వివరించారు.